# జమిలి ఎన్నికలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

వచ్చేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతున్న కేంద్రం.. దేశవ్యాప్తంగా ఒకేసారి అసెంబ్లీలను రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. దీనిపై పార్టీ నేతలం అందరం కూర్చొని చర్చిస్తామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఈ ఎన్నికల విషయంలో ఏ విధంగా ముందుకు పోతుందో స్పష్టతనివ్వాలన్నారు కేటీఆర్. ఎన్నికలపై మరిన్ని వివరాలు ఇవ్వాలని, పార్టీల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు. మూడు నెలల క్రితమే పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయని, జమిలి ఎన్నికలు అంటే అన్ని రాష్ట్రాలతో కలిపి నిర్వహించడమే అని అన్నారు. అలాంటప్పుడు వచ్చే జనవరి, ఫిబ్రవరిలో ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, వీటి టర్మ్‌లపై ఏం చేయబోతున్నారని కేంద్రం నుంచి స్పష్టత ఇవ్వాలన్నారు.అలాగే.. ముందుముందు జనాభా లెక్కలతో పాటు సీట్ల పునర్విభజన సైతం జరగాల్సి ఉందని కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను సైతం అమలు చేయాల్సి ఉందన్నారు. 2017లో జమిలి ఎన్నికలపై పీఎం మోడీ ప్రతిపాదించినప్పుడు అఖిలపక్ష సమావేశంలో తాను కూడా మద్దతు ఇచ్చినట్లు కేటీఆర్ గుర్తుచేశారు. ఏడేళ్ల తరువాత ఇప్పుడు ప్రతిపాదన వచ్చిందని, అయితే బిల్లు ఏ రూపంలో ఉందని తెలియదని అన్నారు. వీటిపై కేంద్రం స్పష్టత ఇస్తే.. బీఆర్ఎస్ కూడా జమిలి ఎన్నికలపై ఒక నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.

# భూమిని ఢీకొట్టబోతున్న ఆస్టరాయిడ్... మన ఇస్రో శాస్త్రవేత్తల హెచ్చరిక

న్యూఢిల్లీ : అంతరిక్షంలో తిరుగుతున్న ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆ ఆస్టరాయిడ్ ఢీకొంటే దారుణమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ ఆస్టరాయిడ్ పై ఇస్రో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ తాజాగా వెల్లడించారు.

మరో ఐదేళ్లలో ఢీకొనే చాన్స్...

అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్ భవిష్యత్తులో భూమికి అత్యంత సమీపంగా వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. సుమారు 450 మీటర్ల పొడవు, 170 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆస్టరాయిడ్... 2029 ఏప్రిల్ 13న భూమికి అత్యంత దగ్గరగా అంటే.. కేవలం 32 వేల కిలోమీటర్ల సమీపం నుంచి దూసుకువెళుతుందని తేల్చారు. అంటే భూమి చుట్టూ స్థిర కక్ష్యలో తిరిగే కమ్యూనికేషన్ శాటిలైట్ల కంటే కూడా ఇది దగ్గరగా వస్తుండడం గమనార్హం.

'నేత్ర' ఆధ్వర్యంలో పరిశోధన

అపోఫిస్ మన యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య కంటే పెద్దదని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. అపోఫిస్ భూమిని ఢీకొట్టే పరిస్థితి, దాని గమనం, ఇతర అంశాలపై ఇస్రోలోని 'నేత్ర (నెట్ వర్క్ ఫర్ స్పేస్ ఆబ్జెక్ట్ ట్రాకింగ్ అండ్ అనాలసిస్)' విభాగం ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో నాసాకు చెందిన ఒసిరిస్ ఆర్ఈఎక్స్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రామ్సెస్ విభాగాలతో ఆస్టరాయిడ్లపై పరిశోధనలో కలసి ముందుకువెళుతున్నట్టు వివరించారు.

# బంగాళాఖాతంలో ఎల్లుండి మరో అల్పపీడనం

అమరావతి : బంగాళాఖాతంలో కొన్ని రోజుల కిందట ఏర్పడిన తీవ్ర అల్పపీడనం క్రమంగా బలహీనపడింది. ఇదిలా ఉంటే, బంగాళాఖాతంలో ఎల్లుండి (డిసెంబరు 15) మరో అల్పపీడనం ఏర్పడనుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా రేపటికి ఉపరితల ఆవర్తనం విస్తరించే అవకాశం ఉందని, ఇది ఎల్లుండికి అల్పపీడనంగా బలపడుతుందని వివరించింది. ఇది అల్పపీడనంగా మారాక, తదుపరి 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తమిళనాడు తీరానికి చేరువగా వస్తుందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 16న నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నెల 17న కోస్తా, రాయలసీమలో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో, రైతులు వ్యవసాయ పనుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచించింది.

# 2025లో పెను యుద్ధాలు.. భయపెడుతున్న బాబా వంగా జోస్యాలు ఇవే!

న్యూఢిల్లీ : 'బాబా వంగా'గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన వాంజెలియా పాండేవా గుష్టెరోవా అనే బల్గేరియా అంధ ఆధ్యాత్మికవేత్త గురించి అందరికీ తెలిసిందే. ఆమె చెప్పే జోస్యాలు నిజమవుతాయనే భావన ఇందుకు కారణంగా ఉంది. కాగా, మరికొన్ని రోజుల్లోనే ఆరంభమవనున్న నూతన సంవత్సరం 2025కి సంబంధించి బాబా వంగా చెప్పిన జోస్యాలు చర్చనీయాంశంగా మారాయి. అంతర్జాతీయంగా అశాంతిని రాజేసేవి, విధ్వంసాలకు మూలమయ్యే అంచనాలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ఐరోపా విధ్వంసం..

పశ్చిమ దేశాల్లో యుద్ధం పుడుతుందని, పెను విధ్వంసం జరుగుతుందని బాబా వంగా అంచనా వేశారు. "సిరియా పతనం ముగిసిన వెంటనే పశ్చిమ, తూర్పు దేశాల మధ్య భారీ యుద్ధం ఉండొచ్చు. వసంతకాలంలో యుద్ధం ఆరంభమవుతుంది. మూడవ ప్రపంచ యుద్ధం ఉంటుంది. తూర్పులో మొదలయ్యే యుద్ధం పశ్చిమాన్ని నాశనం చేస్తుంది" అని బాబా వంగా జోస్యం చెప్పినట్టు 'డైలీ స్టార్' కథనం పేర్కొంది. సిరియా విజేత కాళ్ల మీద పడుతుందని, అయితే ఒక్కరు కాదని పేర్కొంది.

మరికొన్ని జోస్యాలు ఇవే

2025లో గ్రహాంతర వాసులతో మానవులకు కాంటాక్ట్ ఏర్పడవచ్చని బాగా వంగా అంచనా వేశారు. ఈ పరిణామం బహుశా ప్రపంచ సంక్షోభానికి లేదా అంతానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. కాగా, గ్రహాంతర వాసులకు సంబంధించిన అన్ని ఫైల్స్‌ను విడుదల చేస్తానంటూ డొనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేసిన నేపథ్యంలో ఈ జోస్యానికి ప్రాధాన్యత ఏర్పడింది.ఇక 2025 చివరి నాటికి టెలిపతి అందుబాటులో వస్తుందని, మనుషులు నేరుగా మెదడు నుంచి మెదడు మధ్య సంభాషణ జరుపుకుంటారని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని బాగా వంగా పేర్కొన్నారు. అంతేకాదు 2025లో ముఖ్యమైన శాస్త్రీయ ఆవిష్కరణలు ఉంటాయని పేర్కొన్నారు. టెలిపతితో పాటు నానోటెక్నాలజీలో పురోగతి ఉంటుందని పేర్కొంది. అయితే సాంకేతికతలను దుర్వినియోగం చేస్తే దుష్పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

# అప్పుడు అరచేతిలో వైకుంఠం చూపిస్తే.. ఇప్పుడు కైలాసం చూపిస్తున్నారు..

మొదటి పేజి తరువాయి



సూపర్ సిక్స్ హామీలకు దిక్కులేదని.. మ్యానిఫెస్టోలో పెట్టిన 60 హామీలు పత్తాకు లేవని అన్నారు. మూడు సిలిండర్లలో ఈ ఏడాది సింగిల్ సిలిండర్ తో మమ అనిపించారని పేర్కొన్నారు. 3 వేల నిరుద్యోగ భృతి ఊసే లేకుండా చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు అవిగో , ఇవిగో అంటున్నారు.. స్కూల్ కి వెళ్ళే ప్రతి బిడ్డకు 15 వేలు ఇస్తామని తల్లులకు పంగనామాలు పెట్టారని అన్నారు. రైతుకి 20 వేల సాయం చేసే పథకం అన్నదాత సుఖీభవను దుఃఖీభవ చేశారని విమర్శించారు. ప్రతి నెల 1500 రూపాయలు ప్రతి ఆడబిడ్డకు ఇస్తామన్నారని.. ఆడబిడ్డ నిధి ఎక్కడో అడ్రెస్ లేదని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎప్పుడూ అంటే పండుగలు, పబ్బాల పేరు చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. జూన్ 12 న తొలి సంతకం పెట్టిన %ణూజ% నోటిఫికేషన్ కే ఇప్పటికీ దిక్కులేదని.. ఉచిత ఇసుక పథకంలో ఉచితం ఎక్కడా లేదని చెప్పారు బాబు 6 నెలల పాలన ఎలా ఉందో సోషల్‌మీడియా వేదికగా వివరించారు. "మండలానికి 3 మద్యం షాపులు.. 30 బెల్టు షాపులు. అభివృద్ధిలో 3 మాటలు%ౌ% 30 గ్రాఫిక్స్ డిజైన్లు".. మొదటి 5 ఏళ్లలో అరచేతిలో వైకుంఠం చూపిస్తే.. ఇప్పుడు మళ్ళీ అదే చేతిలో కైలాసం చూపిస్తున్నారని షర్మిల సెటైర్ వేశారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కాస్త " బాబు షూరిటీ%ౌ% వడ్డింపులకు గ్యారెంటీ " లా మారిందని ఎద్దేవా చేశారు. వచ్చిన 6 నెలల్లోనే 17500 కోట్ల రూపాయలు జనం నెత్తిన వేశారని.. క్వాలిటీ మద్యం అంటూనే.. ధరలు పెంచి జనాలను పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఆర్థిక భారంపై మా తప్పేం లేదంటూనే జనం నెత్తిన మోపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు సంగతి ఏంటి అని అడిగితే.. చంద్రబాబు ఇప్పటికీ చెప్తున్న సమాధానం..రాష్ట్రం వెంటిలేటర్ పై ఉంది.. వైసిపి వాళ్ళు 5 ఏళ్లు అడవి పందుల్లా మేశారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. గాడిలో పెట్టాలి అంటున్నారని వైఎస్ షర్మిల తెలిపారు. వైసీపీ 5 ఏళ్ల పాలన దోపిడీ పాలన. దొంగల పాలన అనేది నిజమేనని అన్నారు. నేల, నీరు, ఖనిజం , ఒకటేంటి.. కన్ను పడిందల్లా కాజేశారని విమర్శించారు. వాళ్ళు తిన్నారు కాబట్టే.. జనాలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయించారు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. మీరేదో ఉద్ధరిస్తారని మీకు పట్టం కడితే మీరు చేసేది ఏంటని ప్రశ్నించారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని గాడిలో పెడుతూనే ఉంటారా? ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టరా? అని నిలదీశారు. ప్రజలు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తూ.. గత ప్రభుత్వ తప్పిదాలను అడ్డుపెట్టుకుంటూ.. 6 నెలలు కాలయాపన చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలు సంతృప్తిగా ఉన్నారని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ 4.0 ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ ముగిసింది బాబు అని సూచించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా చూడాలన్నారు.

# స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల

మొదటి పేజి తరువాయి




రాష్ట్ర దశ దిశను మార్చే స్వర్ణాంధ్ర విజన్-2047ను ఇవాళ ఆవిష్కరించామని వెల్లడించారు. "ప్రపంచంలోనే తెలుగుజాతిని నెంబర్ వన్ గా చేసేందుకు ఇవాళ బీజం పడింది.. ఇది సాధ్యమే అని మరొక్కసారి చెబుతున్నా. ప్రజల తలరాతలను, భావితరాల భవిష్యత్ ను మార్చేదే ఈ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్. నేను చాలా ఎన్నికలు చూశాను కానీ... 2024 ఎన్నికలకు ఒక ప్రత్యేకత ఉంది. 1978 నుంచి నేను ప్రత్యక్షంగా ఎన్నికల్లో భాగస్వామినయ్యాను. అనేక ఎన్నికల్లో పోటీ చేశాను. కానీ 2024లో 93 శాతం సక్సెస్ రేటుతో, 57 శాతం ఓట్లు పడిన ఏకైక ఎన్నికలు నా జీవితంలో మొదటిసారి చూశాను. ప్రజల్లో ఆనాడు ఉన్న వాస్తవ పరిస్థితులను పవన్ కల్యాణ్ గారు అప్పుడే గమనించి ఒక మాటన్నారు. ఆ మాట నేనెప్పుడూ కూడా మర్చిపోలేను. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేక ఓట్లు చీలడానికి వీల్లేదు... కలిసి ఉంటే బలం ఉంటుంది... కలిసి పనిచేద్దాం అని స్పష్టమైన వైఖరి ప్రదర్శించి, ఆ మేరకు కలిసి నడిచిన వ్యక్తి పవన్ కల్యాణ్. 2014లోనూ, 2024లోనూ చూశాను... నాకేం వస్తుంది అని కాకుండా... రాష్ట్రానికి ఏం మేలు జరుగుతుంది అని ఆలోచించి పవన్ కల్యాణ్ పూర్తిగా సహకరించారు. అలాంటి ఒక మంచి మిత్రుడు ఉండడం చాలా సంతోషదాయకం. రాజకీయాల్లో నాకు ఎంతో అనుభవం ఉంది... నాలుగోసారి ముఖ్యమంత్రిని... కానీ గత ప్రభుత్వ హయాంలో ఎందుకంత విధ్వంసం జరిగిందో నాకు అర్థం కాలేదు. అన్ని ఇబ్బందులు ఎదుర్కొని, ఒక్కొక్క అడుగు వేస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణం చేస్తున్నాం. కూటమి పాలనకు ఆర్నెల్లు పూర్తయిన వెంటనే... విజన్-2047 డాక్యుమెంట్ ను తీసుకువచ్చి తెలుగుజాతిని భారతదేశానికి అంకితం చేశామంటే అది మా అకుంఠిత దీక్షకు నిదర్శనం. ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక శక్తిమంతమైన దేశంగా తయారవుతోంది. 2047లో మనం 100 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంది. అప్పటికల్లా మన దేశం ప్రపంచంలో ఒక అగ్రదేశంగా ఉండాలన్న ఉద్దేశంతో వికసిత భారత్-2047 కార్యాచరణను ప్రధాని మోదీ రూపొందించారు. ఆ మేరకు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు పోతున్నారు. అందులో భాగంగానే మనం ఈ రోజు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువచ్చాం. మోదీ, మనందరి ఆలోచన భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ గా ఉండాలి. ఈ క్రమంలో... ఏపీతో పాటు తెలుగుజాతి కూడా ప్రపంచంలో నెంబర్ వన్ గా ఉండాలనేది మా సంకల్పం. నేను గానీ, పవన్ కల్యాణ్ గానీ కోరుకునేది అదే. ఇవాళ మన తలసరి ఆదాయం 3 వేల డాలర్ల కంటే తక్కువ. 2047 నాటికి 42 వేల డాలర్లు తలసరి ఆదాయం లభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పవన్ కల్యాణ్ చెప్పినట్టు... ఇంతకుముందు హైదరాబాద్, సికింద్రాబాద్ రెండే నగరాలు ఉండేవి. హైదరాబాద్ నగరం పశ్చిమ ప్రాంతానికి వెళితే ఎక్కడ చూసినా రాళ్లు, గుట్టలే ఉండేవి. ఆ గుట్టల్లో నేను భవిష్యత్ నగరాన్ని చూశాను. ఆ మేరకు 25 సంవత్సరాల్లో ప్రపంచస్థాయిన నగరం అవుతుందని భావించి, ఆ దిశగా రూపకల్పన చేశామంటే అదీ ఆనాటి విజన్ ప్రభావం. పవన్ కల్యాణ్ ఎప్పుడూ అంటుంటారు... సార్, మేమందరం అక్కడ రాళ్లు చూశాం... మీరు మాత్రం ఒక విజన్ చూశారు అని. అవును... ఆ రోజు అందులోనే నేను ఒక సింగపూర్ చూశాను, ఒక దుబాయ్ ని చూశాను, న్యూయార్క్ సిటీని చూశాను. అలాంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేం అని భావించి, అంచెలంచెలుగా అభివృద్ధి చేశాం. ఇవాళ హైదరాబాద్ వల్ల తెలంగాణ రాష్ట్రం భారతదేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం లభించే రాష్ట్రంగా ఉందని గర్వంగా చెప్పగలుగుతున్నాం. మేం ఆనాడు వేసిన పునాదే అందుకు కారణం" అని చంద్రబాబు వివరించారు.

# ఇకనైనా రైతులకు క్షమాపణ చెప్పికేసులు రద్దు చెయ్యి...

మొదటి పేజి తరువాయి

ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. భూమి ఇయ్యను అన్నందుకు గిరిజన రైతులను జైలు లో పెట్టడం ఓకేనట.. జైలులో వారిని చిత్రహింసలు పెట్టడం ఓకేనట.. వారి కుటుంబసభ్యులను అర్ధరాత్రి ఇండ్ల మీద దాడిచేసి భయపెట్టడం, బెదిరించడం ఓకేనట.. నెల రోజులుగా వారికీ చెయ్యని నేరానికి బెయిల్ కూడా రాకుండా అడ్డుపడటం ఓకేనట.. గుండె జబ్బుతో ఉన్న పేషెంటుకు బేడీలు వేయించటం కూడా ఓకేనట అని కేటీఆర్ విమర్శించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇకనైనా క్షమాపణలు చెప్పి కేసులు రద్దు చేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గుండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గుండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గుండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ నేతృత్వంలో వైద్యులు అశోక్, మజీద్‌ఖాన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయగా ఆసమయంలోనూ రైతుకు బేడీలు తీయలేదు. పరీక్షలు ముగిసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించాలని సూపరింటెండెంట్, వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. హీర్యానాయక్ చాలారోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. 2డీ ఈకో పరీక్ష చేయగా గుండె బలహీనంగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. సంగారెడ్డిలో కాథల్యాబ్ లేనందున నిమ్స్‌కు రిఫర్ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. అండర్ ట్రయల్‌లో ఉన్న ఖైదీలకు సంకెళ్లు వేయవద్దని గతంలో కోర్టులు చెప్పినా అవేమీ పట్టించుకోండా కంది సెంట్రల్ జైలు పోలీసులు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించటం తీవ్ర విమర్శలకు దారితీసింది. జైలు అధికారుల తీరును గిరిజన, రైతు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

### తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం..

# కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆయనను విచారించేందుకు సన్నద్ధం అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా గతేడాది ఫిబ్రవరిలో ఫార్ములా ఈ-కారు రేస్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఫార్ములా ఈ-కారు రేసు నిధుల కేటాయింపులో భారీ అవినీతి జరిగినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంస్థ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటికే ఉన్న ఇద్దరు పురపాలక శాఖ అధికారులతో పాటు అప్పట్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు అధికారులపై విచారణకు అనుమతించింది. అలాగే ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు కోసం అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. దీనిపై న్యాయ సలహా మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేటీఆర్‌ను విచారించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

# చంద్రబాబుకు ఇదంతా అవసరమా అనిపిస్తుంది: పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి



అనంతరం పవన్ ప్రసంగించారు. రాష్ట్రాన్ని ముందుకు నడిపించే ఈ స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో భాగస్వామం కావడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని పవన్ అన్నారు. యువకుడిగా ఉన్నప్పుడు ఎంతో సాధించాలని ఉండేదని, చాలా నేర్చుకోవాలనిపించేదని తెలిపారు. ఒక పది ఇరవై ఏళ్ల తర్వాత నువ్వు ఎలా ఉండాలనేది ముందుగా రాసిపెట్టుకోవాలని ఓ పుస్తకంలో చూశానని పవన్ వెల్లడించారు. ఒక పెద్ద నటుడ్ని అవ్వాలనో, బిజినెస్ మేన్ అవ్వాలనో, డాక్టర్ అవ్వాలనో రాసుకున్నప్పుడు చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుంది... కానీ అది ఒక దిక్సూచి అని పేర్కొన్నారు. "చంద్రబాబు విజన్-2020 అన్నప్పుడు మాదాపూర్ లో మేం చూసింది రాళ్లు గుట్టలే. కానీ చంద్రబాబు సైబర్ సిటీని చూశారు. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలు గుర్తు లేకపోవచ్చు కానీ... ఆ నిర్మాణం గుర్తుండిపోతుంది. అలాంటిదే సైబర్ సిటీ కూడా. ఈ రోజున ఇన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తోన్న సైబర్ సిటీకి రూపకర్త చంద్రబాబే. ఇవాళ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్నప్పుడు మనసుకు చాలా తృప్తిగా అనిపించింది. కోట్ల మంది ప్రజలకు బలం ఇవ్వడానికి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది బాటలు పరుస్తుంది. వ్యక్తి వ్యవస్థను నిర్మిస్తే... ఆ తర్వాత వ్యవస్థ వ్యక్తులను తయారుచేస్తుంది. చంద్రబాబు సుదీర్ఘ అనుభవం, నాయకత్వ సామర్థ్యం అమోఘమైనవి. నిద్రాహారాలు లేకుండా ఆయన పడే తపన చూస్తుంటే... ఆయనకు ఇదంతా అవసరమా అని చాలామందికి అనిపిస్తుంటుంది. ఓవైపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న పార్టీని నడిపించాలి... పార్టీ వ్యక్తుల్లో ఆశలు ఉంటాయి... వాటిని పరిగణనలోకి తీసుకోవాలి... మరోవైపు తన కుటుంబాన్నే కాకుండా ఐదు కోట్ల మంది ప్రజలు తన కుటుంబంలా చూసుకోవాలి... వారి అవసరాలు తీర్చాలి... ఇంకో వైపు రాజకీయ ప్రత్యర్థులు చేసే దాడులు తట్టుకోవాలి... ఇవన్నీ ఎదుర్కొంటూ నిలబడడం చంద్రబాబు ప్రత్యేకత. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత భారత్ గురించి ఆలోచిస్తుంటారు... దాన్లో విజన్-2047 కూడా ఓ అంతర్భాగం. ఒక వ్యక్తి కంటే కల... కోట్లాది మంది కలగంటే అది ఒక పరిపూర్ణ సంకల్పం... అదే మన స్వర్ణాంధ్ర విజన్-2047" అని పవన్ కల్యాణ్ వివరించారు.

# ఇక దూసుకుపోవడమే..ఫుల్ క్లారిటీ ఇచ్చిన చంద్రబాబు!

మొదటి పేజి తరువాయి




నిన్న, మొన్న రెండు రోజుల పాటు జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు, మంత్రులతో చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశం దీనికి చక్కటి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. తొలి రోజు 9 గంటలు, రెండో రోజు 13 గంటల సేపు ఈ సమావేశాలు కొనసాగాయి. 22 గంటల సేపు కొనసాగిన ఈ సమావేశాల సందర్భంగా జిల్లా కలెక్టర్లు ఏం చేయాలనే దానిపై చంద్రబాబు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. తన మార్క్ పాలన ఎలా ఉంటుందో మరోసారి అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో ప్రతి డిపార్ట్ మెంట్ గురించి ఆయన మాట్లాడారు. మనం ప్రజా సేవకులమే కానీ... పెత్తందారులం కాదని హెచ్చరించారు. ప్రజలను ప్రభుత్వంలో భాగస్వాములుగా భావించాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశాన్ని లైవ్ టెలికాస్ట్ కూడా చేయడం గమనార్హం. కూటమి ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు, ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఎలా ఉంటుందనే విషయాలు అధికారులతో పాటు సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యేందుకు ఇది దోహదపడుతుండనడంలో సందేహం లేదు. ఈ సమావేశం ద్వారా ఏయే శాఖలు ఎలా ముందుకు సాగుతున్నాయనే విషయంపై ప్రజలకు, రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న అన్ని డిపార్ట్ మెంట్ల ఉద్యోగులకు పూర్తి స్పష్టత వచ్చిందనడం అతిశయోక్తి కాదు. తాను టీమ్ లీడర్ అని... మీరందరూ తనతో ఎలాంటి అరమరికల్లేకుండా మాట్లాడవచ్చని జిల్లా కలెక్టర్లకు, ఉన్నతాధికారులకు చంద్రబాబు తెలిపారు. పనితీరు బాగోకపోతే జిల్లా కలెక్టర్లయినా, మంత్రులైనా పక్కన పెట్టేస్తానని హెచ్చరించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తానని... పనితీరు బాగున్న వారిని సరైన స్థానంలో పెడతానని చెప్పారు. నాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలనేదే తన లక్ష్యమని, ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని... దాన్ని సాధించాలంటే తాను కఠినంగా ఉండక తప్పదని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలను భాగస్వాములను చేయాలని... అలాగని వారు చెప్పిన పనులన్నీ చేయాల్సిన అవసరం లేదని చంద్రబాబు చెప్పారు. తప్పుడు పనులు చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనేది దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని చెప్పారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను మూడు నెలల్లో పరిష్కరించాలని... ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూల వాతావరణాన్ని నెలకొల్పాలని అన్నారు. పాలనలో వేగం పెరగాలని... మార్పు అనేది స్పష్టంగా కనపడాలని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో మీ పాత్ర చాలా కీలకమని అన్నారు. యంత్రాంగంలో అవినీతికి, నిర్లక్ష్యానికి తావు లేకుండా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి దానికి నిధులు అవసరం లేదని... వినూత్నమైన ఆలోచనలతో సమస్యలను పరిష్కరించవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్లు లేవనెత్తిన ప్రతి అంశాన్ని విన్న చంద్రబాబు అక్కడికక్కడే వాటికి పరిష్కారాలను సూచించారు. పూర్తి సమాచారంతో రాని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన, సమాచారం లేకుండా రావడం వల్ల ఉపయోగం లేదని చెప్పారు. ప్రతి విషయంపై అందరికీ అవగాహన ఉండాలని అన్నారు.

**చంద్రబాబు చెప్పిన కీలక అంశాలు:**

వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. రైతుకు చిన్న సమస్య కూడా రాకూడదు. పోర్ట్ అయినా, స్టీల్ ప్లాంట్ అయినా, ఏ అభివృద్ధి ప్రాజెక్ట్ అయినా రైతులను భాగస్వాములను చేయాలి. అమరావతి భూసేకరణ విధానం అత్యుత్తమ మోడల్.అన్ని ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యతను ఇస్తాం.అమరావతి, తిరుపతి, విశాఖలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.దేశంలోని టాప్ టెన్ యూనివర్శిటీలు, స్కూళ్లు, ఆసుపత్రులు అమరావతిలో ఏర్పాటయ్యేలా కృషి చేస్తున్నాం. 2050 నాటికి అమరావతిలో 15 లక్షల ఉపాధి అవకాశాలు వస్తాయి. వీటిలో 20 నుంచి 25 శాతం ఉద్యోగాలు ఈ ఐదేళ్లలోనే వస్తాయి. ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.విద్యుత్ ధరలు యూనిట్ కు 30 నుంచి 40 పైసలు తగ్గించాలి. పీఎం సూర్యఘర్ కింద ప్రతి ఇంటి మీద విద్యుత్ ఉత్పత్తి జరగాలి. ఉత్పత్తి అయిన విద్యుత్ ను ఉపయోగించుకుని... మిగిలిన దాన్ని అమ్ముకోవచ్చు. ఇళ్లపై విద్యుదుత్పత్తిని జిల్లా కలెక్టర్లు ప్రోత్సహించాలి. తూర్పు తీరంలో భారీ పోర్టును నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.సముద్ర తీరం వెంట రహదారిని నిర్మించి దాన్ని జాతీయ రహదారులకు అనుసంధానించాలి.రాష్ట్రంలో ఎక్కడినుంచైనా గంట సమయంలో వెళ్లేలా విమానాశ్రయాలు ఉండాలి. కొందరు నేరస్తులు రాజకీయ ముసుగులో ఉన్నారు. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్టు పోస్టులు పెడుతున్నారు. వీటి నియంత్రణకు మంత్రులు లోకేశ్, అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ లతో కమిటీని ఏర్పాటు చేస్తున్నాం.

## నాటు సారా తయారీకి దాచి ఉంచిన
# 400 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్,బాపట్ల మరియు అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సుపెరిడేంట్,బాపట్ల వారి ఆదేశాల మేరకు నిజాంపట్నం మండలంలోని దిండి పంచాయతి పరిధి గల అదవల గ్రామ పరిసర ప్రాంతాలలో నాటు సారా కాస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు బాపట్ల ఇ ఎస్ టీ ఎఫ్ ఎస్ఐ ఏ శ్రీనివాస రావు మరియు స్థానిక నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ మార్తురి శ్రీరామ్ ప్రసాద్ శుక్రవారం వారి వారి సిబ్బందితో కలిసి అదవల ప్రాంతానికి దక్షిన దిశగా 3 కిలోమీటర్ల దూరం లో గల మడ అడవులలో దాడులు నిర్వహించగా మూడు ప్రాంతలలో నాటు సారా తయారీ కోసం దాచి ఉంచిన మొత్తం 400 లీటర్ల బెల్లం ఊటను కనుగొని ధ్వంసం చేసినట్లు నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ చెప్పారు. అదేవిదంగా నాటు సారా తయారీ కోసం ఏర్పాటు చేసిన ఒక నాటు సారా బట్టిను ధ్వంసం చేసినట్లు అయన తెలిపారు. నాటు సారాని తాయారు చేసే మరియు అమ్మే వ్యక్తుల పై నిరంతర నిఘా ఉంటుంది కనుక నాటు సారా తయారీ గురించి అమ్మకాల గురించి మీకు ఏమైనా కొత్త సమాచారం తెలిసిన యెడల ఈ క్రింది నెంబరు కు తెలియజేయగలరు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అయన తెలియజేశారు. నాటు సారా తయారీ మరియు అమ్మకాలు చేసే వ్యక్తులను దిండి పంచాయతి పరిధిలో గల అదవల,పరిశవారిపాలెం ,జంపనివారిపాలెం,కేసనివారిపాలెం,యేమినేనివారిపాలెం ప్రాంతాలలో గుర్తించమని వారిపై బైండ్ఓవర్ కేసు లు నమోదు చేస్తామని తెలిపారు. అంతే కాకుండా నిజాంపట్నం మండలంలో నల్లబెల్లంను నాటు సారా తయారీదారుడికి అమ్మేవారిపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రికరించామన్నారు.గతంలో నాటు సారాని అమ్మినవారిపైన మరియు వారికీ సహకరించిన వారిపై కొన్ని బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసామని ,అదే విదముగా నాటు సారా సేవించడం అనేది అరోగ్యనికి హానికరం కావున ప్రజలు గుర్తుఎరిగి నడుచుకోవాలని నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ గారు సూచించారు.ఈ దాడులలో కానిస్టేబుల్ కే.శ్రీనివాసరెడ్డి,పి శ్రీనివాస రెడ్డి, కె మధుసూదన్ రావు , కె గోపి కృష్ణ , జి వాసుదేవ రెడ్డి మరియు స్టేషన్ డ్రైవర్ పి.భాస్కర్ పాల్గొన్నారు.

## శింగనమల నియోజకవర్గం నార్పల మండలంలో
# నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు



నార్పల /డిసెంబర్ 13(జనం రిపోర్టర్): నార్పల మండలంలో రేపు, అనగా డిసెంబరు 14వ తేదీన నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల రెవిన్యూ అధికారి (ఎంఆర్ ఓ) అరుణకుమారి తెలిపారు.ఈ ఎన్నికలు ఆమె ఆధ్వర్యంలో జరుగుతాయని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ మూర్తి ప్రకటించారు. మండల వ్యాప్తంగా ఉన్న ఆరు గ్రామాలైన బొందలవాడ, నార్పల,దుగుమర్రి,బి. పప్పూరు,చామలూరు, నడిమి దొడ్డి గ్రామాల మొత్తం 2,036 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం మొత్తం 12 టీసీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అన్ని గ్రామాల ఓటర్లు తమ ఓటు హక్కును క్రమశిక్షణతో వినియోగించుకోవాలని వారు కోరారు.

# నేడు విద్యుత్ కు అంతరాయం

రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: రేపల్లె పట్టణ విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి! రెండవ శనివారం అనగా 14 తేదీన రేపల్లె 132 కేవీ సబ్ స్టేషన్ నందు అత్యవసర పని ఉన్నందున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రేపల్లె టౌన్ మరియు రూరల్ ఏరియా నందు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుచున్నది. కావున వినియోగదారులు సహకరించాలని కోరుచున్నాము.అని ఏ డి ఇ సురేష్ బాబు తెలియజేశారు

## ఆకుల విజయ్ కుమార్, బాబుని మర్యాదపూర్వకంగా
## కలిసిన నార్పల మండలం ముస్లిం సోదరులు

నార్పల /డిసెంబర్ 13(జనం రిపోర్టర్): నార్పల మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు మతపెద్దలు ఆకుల బాబు ని కలిశారు 2025 జనవరి నెలలో 18,19 వ తేదీలలో జరుగు ఇజీతిమ ,(ఇస్తామా) కార్యక్రమం జరుపుకోవడానికి నార్పల క్రాసింగ్ లోని కీర్తిశేషులు శ్రీ ఆకుల లక్ష్మీపతి , తోట స్థలాన్ని ఇజీతిమ జరుపుకోవడానికి ఇవ్వాలని మైనార్టీ వర్గీయులు కోరారు. ఆకుల బాబు ,, అడిగిన వెంటనే స్పదించి ఒప్పుకొని మా కుటుంబం ముస్లిం మైనారిటీలకు ఎప్పుడు అండగా ఉంటుందని తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ కొనసాగుతాయని తెలిపారు.అందుకు ముస్లిం సోదరులు సంతోషం వ్యక్త పరుస్తూ ఆకుల బాబు ,కి కృతజ్ఞతలు తెలియజేసారు

# సి సీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మాత్యులు అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ శంకుస్థాపన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. 13వ వార్డులో శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి ప్రభుత్వ లక్షణం అని తెలియజేశారు పట్టణాల్లోనూ గ్రామాల్లోనూ నిబంధనల ప్రకారం రహదారులు అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో , పంతాని మురళిధరరావు, పంతాన్ని సాయికుమార్ మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు మున్సిపల్ చైర్ పర్సన్ కట్ట మంగ మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

# వి ఆర్ ఓ బాలకోటేశ్వరావు మృతి



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్ : రేపల్లె పట్టణం 4వార్డు నివాసి మొన్నటి వరకు భట్టిప్రోలు మండలం పల్లెకోన విఆర్ఓ గా పనిచేసే ఇటీవల నగరం మండలానికి బదిలీ అయిన వీఆర్వో బాలకోటేశ్వరరావు గుండెపోటుతో శుక్ర వారం మృతి చెందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బాలకోటేశ్వరరావు45 గతంలో రేపల్లె మండలం నల్లూరు గ్రామం వీఆర్వో గాను మరల నగరం మండలంలోని భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలోనూ వీఆర్వో గా పనిచేసి బదిలీపై నగరం మండలం నగరం విఆర్ఓగా పనిచేస్తున్నారని తెలియజేశారు మృతునికి భార్య ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారని తెలియజేశారు మృతదేహాన్ని తాసిల్దార్ కార్యాల సిబ్బంది రేపల్లె మండలం తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు ఆర్ఐ రాంబాబు తదితరులు పరామర్శించారు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు వీఆర్వో బాల కోటేశ్వరరావు మృతి తీరని లోతంతటని తెలియజేశారు వారి స్వగ్రామమైన రేపల్లెకు మృతదేహాన్ని పంపడం జరిగిందని ఆయన తెలియజేశారు

## పాఠశాల పారిశుద్ధ్య సిబ్బందికి
# వేతన బకాయిలు చెల్లించండి
### జూనియర్ కాలేజి ఆవరణలో చెత్తను తొలగించండి
### అధికారులను కోరిన పీవి శేషయ్య



(కనిగిరి డిసెంబర్ 13 జనంరిపోర్టర్ ): ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేసే స్కూల్ పారిశుధ్య సిబ్బందికి ఐదు నెలలుగా ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ అధికారులను మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పీవీ శేషయ్య కోరారు.ఆయన శుక్రవారం కనిగిరి ఎంఈఓ డి.సుబ్బారావును కలిసి వినతి పత్రం అందజేశారు. కనిగిరి మండలం లో 114 మంది సిబ్బంది పని చేస్తున్నారని ఐదు నెలలుగా వేతన బకాయిలు చెల్లించనందున తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని శేషయ్య వారి దృష్టికి తీసుక వెళ్లారు దీనిపై ఎంఈఓ స్పందిస్తూ జూన్ ఆఖరి వరకు వేతనాలు చెల్లించడం జరిగిందని, మిగిలిన బకాయిల చెల్లింపుకై ప్రభుత్వానికి సిఫార్సు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.కనిగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో జూనియర్ కాలేజీ, హై స్కూల్ మరియు విద్యార్థుల హాస్టల్ నిర్వహించడం జరుగుతుందని స్కూల్ పారిశుద్ధ్య సిబ్బంది రోజువారి సేకరించిన చెత్తను కళాశాల ఆవరణలో నిల్వ చేస్తున్నారు. మున్సిపాలిటీ వారు చెత్తను ఎప్పటికప్పుడు తరలించనందున,పేరుకుపోయిన చెత్తను తగలబెట్టడం జరుగుతుంది. దీనితో పర్యావరణ కాలుష్యంవలన విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. విద్యార్థులకు కలుగుతున్న అసౌకర్యాన్ని నివారించేందుకు రోజువారి చెత్తను తరలించే విధంగా ఏర్పాట్లు చేయవలసిందిగా మునిసిపల్ కమిషనర్ను మరియు సిబ్బందిని కోరడం జరిగింది

## మున్సపాల్టీ వ్యవసాయమార్కెట్ ఏర్పాటు కోసం
# పార్టీలకు అతీతంగా మద్దత్తు ఇవ్వండి



ఏటూరునాగారం /డిసెంబర్ 13(జనం రిపోర్టర్): ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్రఅధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం 20148మంది జనాభా కలిగిన ఏటూరునాగారం ఎందుకు మున్సిపాలిటీ కాకా పోవడానికి మన ప్రాంత కాంగ్రెస్ తెరాస నాయకులతో పాటు మైదానప్రాంత నాయకులే ప్రధాన కారణంఅన్నారు ఆదివాసీ దళిత బహుజన వర్గాల రైతులు అధికంగా మిర్చి వరి ఇతర ధాన్యలు పంటలు పండించే రైతులకు వ్యవసాయమార్కెట్ అందుబాటులో ఉండక పోవడానికి కాంగ్రెస్ తెరాస నాయకులే కారణం అన్నారు అదేవిదంగా ఇప్పటికైనా పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షమా శాఖ మంత్రి ఆదివాసీ దళిత బహుజన వర్గాల రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చెయ్యాలని అన్నారు అదేవిదంగా మైదాన ప్రాంత నాయకులు 1952 హన్మంతరావు నుండి నేటి పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశుసంక్షమాశాఖ నీటి పారుదల శాఖమంత్రి మైదానప్రాంతనాయకులు పాలకులుకావడంవలనే ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ వర్గాలు నివాచించే ప్రాంతాలు కానీ ప్రజలు కానీ అభివృద్ధి కాలేదని అన్నారు ఇప్పటికైనా మైదానప్రాంత నాయకులు మాటలు నమ్మి మోసపోకుండా మన ప్రాంత అభివృద్ధి కోసం మున్సిపాలిటీ వ్యసాయమార్కెట్ కోసంచేసే పోరాటానికి పార్టీలకు అతీతంగా మద్దత్తు ఇవ్వండి అన్నారు

## నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై
# చర్యలు తీసుకోవాలి



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: నిబంధనలు పాటించని ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి - ఎస్ ఎఫ్ ఐ డిమాండ్ నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయం లో వినతి పత్రం అందజేసిన అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్ మరియు సూర్యలు మాట్లాడుతూ రేపల్లె పట్టణం లోని ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో కూడా పూర్తిగా తరగతులు నిర్వహిస్తున్నారు రాత్రి 9 గంటల వరకు కూడా విద్యార్థులను మానసిక ఒత్తిడి లకు గురి చేస్తున్నారు ఇదే అంశాన్ని పలు దఫాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకపోయిందన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులు వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సెలవు రోజుల్లో సెలవు ఇప్పించాలని నిర్ణీత సమయం ప్రకారం విద్యాసంస్థల అనుమతి ఇవ్వాలని లేనిపక్షంలో విద్యార్థులతో కలసి ఆందోళనకు సిద్ధం అవుతాం అన్నారు...

## రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు




రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసిల్దార్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కమరాజుగడ్డ నార్త్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దుచేసి ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేశారని కొనియాడారు. ప్రతి రైతు తన భూమిని సొంత కొడుకుతో సమానముగా చూసుకుంటారనే ఉద్దేశ్యముతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు, వివాదాలు పరిష్కరించడమ ఆశయంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయటం అభినందనీయమన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సూచనలు సలహాల మేరకు పంచాయతీకి సంబంధించిన భూ సమస్యలను సత్వరం పరిష్కరించి, ప్రజలకు అండగా నిలబడతామని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శివశంకర్ అర్ ఐ రాంబాబు సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు

## సియంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర



(కనిగిరి డిసెంబర్ 13 జనంరిపోర్టర్ ): వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది దరఖాస్తు చేసుకున్న 8మందికి.3,47,486 రూపాయలచెక్కులను స్థానిక శ్యాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. మాకినేని సుభాషిణి - 26, 218 రూపాయలు, గూడూరి జయమ్మ - 1,05,343 రూపాయలు మేడం మహేశ్వరరెడ్డి - 26,500 రూపాయలు దింటకుర్తి వెంకట సుకుమార్ - 25,000 రూపాయలు కుంకు సుబ్బమ్మ - 66,713 రూపాయలు పెరుమన ఈశ్వరమ్మ - 30,786 రూపాయలు గువ్వల రమణమ్మ - 43,006 రూపాయలు గాయం రమాదేవి - 23,920 రూపాయలు చొప్పున చెక్కులను అందజేశారు

# సకాలంలో ప్రజలకు మంచినీటి సరఫరా



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో (అరవపల్లి) గల మంచినీటి సరఫరా అభివృద్ధి పథకం 5.40ఎం ఎల్ డి ఫిల్టరేషన్ ప్లాంట్ ను పరిశీలించి సకాలయంలో ప్రజలకు నీటిని అందించే విధంగా చర్యలో తీసుకోవాలని మున్సిపాలిటీ సిబ్బందికి రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మాత్యులు అనగాని సత్య ప్రసాద్ సూచనల మేరకు వారి సోదరుడు అనగాని శివప్రసాద్ సూచించారు సిబ్బందితో మాట్లాడుతూ పట్టణంలో పైపులైన్లకు లీకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు .సమయపాలన పాటించి సకాలంలో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఆదేశించారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. వీరి వెంట ధర్మ తేజ టిడిపి నాయకులు పాల్గొన్నారు

## విలేకర్ల భద్రతకు చట్టాలు పటిష్ఠంగా అమలు చేయాలి



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: వైఎస్సార్ కడప జిల్లా పులివెందల నియోజకవర్గ వేముల మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సాక్షి విలేకర్లపై టీడీపీ నాయకులు పాల్పడిన భౌతికదాడికి నిరసనగా శుక్రవారం రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద పలువురు విలేకర్లు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే విలేకర్ల భద్రతకు కల్పించేందుకు ప్రభుత్వం చట్టాలను పటిష్ఠవంతంగా అమలు చేయాలని, సాక్షి విలేకర్లపై భౌతికదాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విలేకర్లు కోరారు. విలేకర్లను బెధిరించినా, దాడులకు పాల్పడితే శిక్షర్హులని ఉన్నత న్యాయస్థానాలు చేసిన నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. కార్యక్రమంలో బొడ్డు మణివరకుమార్, శీలం సోమయ్య (భరత్), నాగప్రసాద్, చింతల సురేష్, బడుగు నాగరాజు, పోలుబోయిన నాగబాబు, జాలాది అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## జి ఓ 124 వెంటనే అమలు చేస్తూ సచివాలయం ఏఎన్ఎం లను పి హెచ్ సి అండర్లో పారామెడికల్ ప్రజరోగ్య విధులకు పరిమితం చేయాలి.
### ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్



ఎటపాక డిసెంబర్ 13జనం రిపోర్టర్: అల్లూరిసీతారామరాజు జిల్లాఎటపాక మండల ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యలో, సహాయ కార్యదర్శి గుజ్జా సీతమ్మ నేతృత్వంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఇ ఓ అర్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గుజ్జా సీతమ్మ మాట్లాడుతూ సచివాలయం ఏఎన్ఎం లు పూర్తిస్థాయిలో పారామెడికల్ విధులు నిర్వహించాల్సిందిగా సెప్టెంబర్ నెలలోనే జి ఓ 124 ని విడుదల చేయడం జరిగిందని కనుక 124 జీవో ని అమలు చేయాల్సిందిగా ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ అక్టోబర్ నెలలోనే మెమో 312 ద్వారా జిల్లా కలెక్టర్లకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు పంచాయితీ రాజ్ శాఖాధికారులను ఆదేశించడం జరిగింది. ఇప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సచివాలయం ఏ ఎన్ ఎం లు పూర్తిగా పారామెడికల్ విధులు నిర్వహించకుండా, సచివాలయం పనులు పురమయిస్తూ ప్రజారోగ్య కార్యక్రమాల విధులకు ఆటంకం కలిగిస్తున్నారు కాబట్టి ఎంపీడీవో కి వినతిపత్రం ద్వారా సచివాలయం ఏ ఎన్ ఎం లు పి హెచ్ సి వైద్యాధికారి కంట్రోల్ లో పూర్తిగా ప్రజారోగ్య, పారామెడికల్ కార్యక్రమాల విధులు నిర్వర్తించుకునేలా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు పాటించాల్సిందిగా స్పష్టం చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సలహా దారులు మడివి నెహ్రూ, సి హెచ్ ఓ సౌందర్య, ఏ ఎన్ ఎం లు అన్నపూర్ణ, శ్రీదేవి, పార్వతి, లక్ష్మి, జయ, సంధ్య, రమణి, తిరుపతమ్మ, సమ్మక్క, హెల్త్ అసిస్టెంట్ లు గంగరాజు, భాస్కర్, శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు రమణ, అనిత పాల్గొన్నారు.


## మంత్రి ఆశీర్వాదం తీసుకున్న
## అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శనిగరపు సాహు



హసన్ పర్తి మండలం డిసెంబర్ 13 జనం రిపోర్టర్: . భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆశీర్వదించిన మంత్రి హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన శనిగరపు సాహు గత రెండు నెలల క్రితం జరిగినటువంటి యూత్ కాంగ్రెస్ ఎన్నికలలో హుస్నాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా భారీ మెజార్టీతో గెలుపొందడంతో శుక్రవారం రోజున హైదరాబాద్ లో రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని ఆశీర్వదించినటువంటి పోన్నం ప్రభాకర్ గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆశీర్వదించారని తెలిపారు.అనంతరం పత్రిక విలేకరుల సమావేశంలో అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శనిగరపు సాహు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలోనే ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ ప్రజలకు ప్రజా పరిపాలన అందించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలలో అన్ని హామీలు నెరవేర్చుమని వ్యవసాయ రంగానికి24 గంటల తోపాటు ఎన్నికల్లో చెప్పినట్టుగా సన్న రకం ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు 500 రూపాయల బోనస్ రూపంలో రైతులకు నగదును అందించడమైనదని అలా బోనస్ అందించడం చాలా సంతోష్ దాయకమైన విషయమని రైతులు సంతోషపడుతున్నారని తెలిపారు సంక్రాంతి పండుగ పర్వదినాన రైతులకు కానుకగా ఇవ్వబోతున్నటువంటి రైతుబంధు ఎకరాకు 7500 అందించడం జరుగుతుందని ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యము వడ్డీలేని రుణములు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ప్రతి గృహానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడం జరిగిందని నూతన సంవత్సర కానుకగా రైతుబంధు తో పాటుగా వృద్ధులు వితంతువులకు 4000 వికలాంగులకు 6000 అందించడం జరుగుతుందని ప్రతిపక్ష నాయకులు ప్రజా ప్రభుత్వం చేస్తున్నటువంటి పనులను చూసి జీర్ణించుకోలేక 9 సంవత్సరాలు పరిపాలన చేసి ఏ ఆకాంక్ష కొరకైతే పోరాడినామో అలా సాధించుకున్నటువంటి తెలంగాణలో తెలంగాణ తల్లి విగ్రహము అధికారికంగా చేపట్టకుండా చిన్నచూపు చూసి వదిలేసిందని కానీ ప్రజా పాలన ప్రభుత్వం అధికారికంగా కవులు కళాకారులు మేధావులు ఆలోచన విధానాలతో డిసెంబర్ 9వ తారీఖున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తే జీర్ణించుకోలేక రాజకీయాలు చేస్తున్నారని అలాంటి మతిస్థితం కోల్పోయి చిల్లర రాజకీయం చేస్తున్నటువంటి వ్యక్తులకు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు ప్రతిపక్ష నాయకులు ప్రజలకు అవసరమైనటువంటి విద్య వైద్యం సంక్షేమంలో అందించే విషయాలకు సలహాలు సూచనలు ఇస్తే బాగుంటుందని అన్నారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శనివారం - 14 - డిసెంబర్ - 2024

## సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి




హసన్ పర్తి మండలం డిసెంబర్ 13 జనం రిపోర్టర్: హసన్ పర్తి సిపిఎం పార్టీ హనుమకొండ జిల్లా బహిరంగ సభను విజయవంతం చేయాలని హసన్ పర్తి మండల సిపిఎం కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.హసన్ పర్తి మండల సిపిఎం కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు హసన్ పర్తి బస్టాండ్ కూడలి వద్దనుండి శుభమస్తు గార్డెన్స్ వద్దకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య హాజరువుతున్నట్లు ఆయన తెలిపారు.బహిరంగ సభ ప్రారంభానికి ముందు హసన్ పర్తి బస్ స్టాండ్ నుండి బహిరంగ ప్రదేశం శుభమస్తు గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని ఆయన తెలిపారు.జిల్లాలోని సీపీఎం పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజవంతం చేయాలని రాములు కోరారు.

## ప్రభుత్వ పాఠశాల సమస్యలను పరిష్కరించాలి ఏఐఎస్ఎఫ్



హసన్ పర్తి మండలం డిసెంబర్ 13 జనం రిపోర్టర్: హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక లష్కర్ బజార్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పరిస్థితిని, పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ లు మాట్లాడుతూ లష్కర్ బజార్ లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 600 మంది విద్యార్థులు ఉన్నారని, మొత్తం 16 తరగతి గదులు ఉన్నాయని, విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు, విద్యార్థులకు సరేనా మూత్రశాలలు మరుగు దొడ్లు, మౌళిక సదుపాయాలు లేనందువల్ల విద్యార్థులు ఆనేక అవస్థలు పడుతూ ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు గత 4 నెలలుగా



విడుదల కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కే. కుషాల్, అభి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం ఎన్టీపీసీలో 5 రోజుల హిందీ అనువాద కార్యక్రమం...




**రామగుండం /డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** సెంట్రల్ ట్రాన్స్‌లేషన్ బ్యూరోచే 5-రోజుల హిందీ అనువాద కార్యక్రమం రామగుండం ఎన్టీపీసీ ఇ డి సి మిలీనియం హాల్, లో 9 డిసెంబర్ 2024 నుండి, 13 డిసెంబర్ 2024 వరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని 9 డిసెంబర్ 2024న.రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు, హెచ్ఆర్ హెడ్ బిజోయ్ కుమార్ సిక్దార్ సమక్షంలో ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా, కేదార్ రంజన్ పాండు అంతరాలను తొలగించి, కమ్యూనికేషన్‌ను పెంపొందించే ఏకీకృత భాషగా హిందీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యాలయంలో తన పాత్రను బలోపేతం చేయడానికి అధికారిక పనిలో హిందీని తరచుగా ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన వివరించారు. 13 డిసెంబర్ 2024న. జనరల్ మేనేజర్ తఎకె త్రిపాఠి, రామగుండం ద్వారా కార్యక్రమం ముగింపు జరిగింది. ఎకె త్రిపాఠి తన ప్రసంగంలో పాల్గొన్న వారందరినీ హిందీని ప్రోత్సహించలని తెలిపారు. ఈ శిక్షణ యొక్క ప్రాథమిక లక్ష్యం అధికారిక కమ్యూనికేషన్‌లో హిందీ రాజ్‌భాష వినియోగాన్ని ప్రోత్సహించడం, పాల్గొనేవారి అనువాద నైపుణ్యాలను మెరుగుపరచడం,శ్రీమతి లేఖా సరిన్






అసిస్టెంట్ డైరెక్టర్, జాన్వారియస్ తిర్కి అసిస్టెంట్ డైరెక్టర్ శిక్షణా సమావేశాలను నిర్వహించారు, అక్కడ వారు హిందీ అనువాదం,భాషా ప్రావీణ్యం యొక్క వివిధ అంశాలలో పాల్గొనేవారికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్ల పంపిణీతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమం ఎన్టీపీసీ ఉద్యోగులు,సి ఐ ఎస్ ఎఫ్ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సహా విభిన్నమైన భాగస్వాముల సమూహాన్ని ఒకచోట చేర్చింది, అంతర్గత, బాహ్య వాటాదారుల నుండి విస్తృత నిశ్చితార్థాన్ని నిర్ధారిస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కె చౌదరి డిప్యూటీ జనరల్ మేనేజర్ హెచ్ ఆర్, ఆదేశ్ కుమార్ పాండే ,అతర్‌సింగ్ గౌతమ్ అడిషనల్ జనరల్ మేనేజర్ రాజ్‌భాష ఈ కార్యక్రమంలో కార్పొరేట్ కార్యాలయం న్యూఢిల్లీ ఆన్‌లైన్ మోడ్ ద్వారా చేరారు.



## ఏఎన్ఎం పై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి




ఎటపాక డిసెంబర్ 13 జనం రిపోర్టర్: మారేడుమిల్లి పీ హెచ్ సి లో ఏఎన్ఎం పై జరిగిన దాడిని కండిస్తూ ఆదివాసీ మెడికల్ మరియు హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుజ్జా సీతమ్మ నేతృత్వంలో ఎటపాక మండలం నెల్లిపాక పీ.హెచ్.సి,లో పారామెడికల్ సిబ్బంది శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గుజ్జా సీతమ్మ మాట్లాడుతూ మారేడుమిల్లి పీ.హెచ్.సీలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని,దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ప్రజారోగ్య సేవలో మహిళా సిబ్బంది ఎక్కువగా పని చేస్తున్నామని, ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోని కారణంగానే నిరంతరం ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయని,సరైన భద్రత కల్పించకపోతే మహిళా సిబ్బంది ఇకపై విధులు నిర్వహించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సలహాదారులు మడివి నెహ్రూ మాట్లాడుతూ వైద్య సేవలు అందిస్తున్న మహిళా సిబ్బంది మన తల్లితో సోదరితో సమానమని అటువంటి వారిపై దాడి చేయడం అత్యంత హేమైనా చర్యని,దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షిస్తూనే, పి.హెచ్.సిలలో, క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత వసతుల కొరత, మందిల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతూ, ప్రతి పీహెచ్సీలో సెక్యూరిటీ గార్డ్ లను నియమించాలని, ప్రతిరోజూ రెండువేళలా పీహెచ్సీలలో మరియు సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ పారామెడికల్ సిబ్బందికి విధి నిర్వహణలో భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భద్రత లేనిదే విధులు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి కాబట్టి ప్రభుత్వం వెంటనే భద్రతా చర్యలు చేపట్టకపోతే ఆదివాసి మెడికల్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యలో ఈ విషయాన్ని తీవ్రంగానే పరిగణిస్తూ.. ఆందోళనలు చేపట్టడానికి సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ సౌందర్య, ఏ ఎన్ ఎం లు అన్నపూర్ణ, శ్రీదేవి, పార్వతి, లక్ష్మి, జయ, సంధ్య, రమణి, తిరుపతమ్మ, సమ్మక్క, హెల్త్ అసిస్టెంట్ లు గంగరాజు, భాస్కర్, శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు రమణ,అనిత పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ లో ముగిసిన ఇంటర్నేషనల్ సెమినార్

పొన్నూరు డిసెంబర్ 13. జనం రిపోర్టర్: పురుగు మందులు, గడ్డి నిర్మూలన ఉత్పత్తుల్లో ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఉండటం వలన ఎక్కువ కాలం నిల్వ ఉండే సామర్థ్యాన్ని పొందటంతో పాటు వ్యవసాయ రసాయనాల అభివృద్ధి జరుగుతుందని ఫ్రాన్స్- లయోన్‌లోని క్లాడే బెర్నార్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనీస్ టిల్లీ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, న్యూఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐఎఫ్‌సీపీఏఆర్ (ఇండో-ఫ్రెంచ్ సెంటర్ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్), సీఈఎఫ్ఐపీఆర్ఏ (సెంటర్ ఫ్రాంకో-ఇండీన్ పౌర్ లా ప్రమోషన్ డీ లా రీసెర్చ్ అవంకీ)ల ఆర్థిక సౌజన్యంతో జాయింట్ ఇండో-ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ " ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపోరరి విస్తాస్ ఇన్ అప్లైయింగ్ (ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టేయినింగ్ ఫ్యూచర్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ సెమినార్‌ను శుక్రవారం





ఘనంగా ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్- లయోన్‌లోని క్లాడే బెర్నార్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనీస్ టిల్లీ మాట్లాడుతూ ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఔషధ పరిశ్రమ, వ్యవసాయ రసాయనాలు, మెటీరియల్స్ సైన్స్ వంటి అనేక రంగాలలో ప్రధానమైన పాత్రను పోషిస్తాయన్నారు. ఫ్లోరినేటెడ్ సమ్మేళనాలు ఔషధాల్లో సమర్థవంతమైన జీవక్రియాపరమైన లక్షణాలను అందిస్తాయన్నారు. క్యాటలైజ్డ్ వ్యూహాల ద్వారా ఈ సమ్మేళనాల తయారీ వేగవంతం అవడంతో పాటు నిర్దిష్టతతో కూడిన ఫ్లోరిన్ సమూహాలను జోడించవచ్చునని పేర్కొన్నారు. సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే, క్యాటలైజ్డ్ వ్యూహాలు చాలా తక్కువ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తాయన్నారు. అంతేకాకుండా అవి పర్యావరణానికి మేలు చేసే ప్రాసెసింగ్ టెక్నాలజీలుగా కూడా ప్రసిద్ధి చెందుతాయన్నారు. కొత్త రసాయన సమ్మేళనాలు తయారు చేయడంలో ఈ వ్యూహాలు సహాయపడతాయని, ముఖ్యంగా ఔషధ పరిశ్రమ, మెటీరియల్ సైన్స్‌లో వినియోగం రోజు రోజుకు పెరుగుతుందన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలైన్ సమ్మేళనాలు తయారికే కాకుండా మరెన్నో రసాయన, బయోటెక్నాలజీ, మెడిసిన్, యాంటీ%-%వైరల్ మరియు యాంటీ%-%బ్యాక్టీరియల్ సమ్మేళనాల తయారీ రంగాల్లో విస్తృతంగా ఉపయోగపడుతుందన్నారు. సహజ ఉత్పత్తుల నిర్మాణంలో కూడా ఆలైన్ నిర్మాణాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ పీ.వెంకటేశు మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో ఐనిక్ లిక్విడ్స్, డీప్ యుటెటిక్స్ సాల్వెంట్స్ ఉపయోగం ద్వారానే పర్యావరణ అనుకూలత, ఆర్థిక లాభాలు, మెరుగైన ఔషధ నాణ్యత సాధ్యం అవుతున్నాయన్నారు. ఐనిక్ లిక్విడ్స్ తక్కువ వాష్పీభవన సామర్థ్యంతో కూడినవి కాబట్టి పర్యావరణానికి హానికరమైనవిగా ఉండవన్నారు. అంతేకాకుండా ఔషధాల స్థిరత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. ద్రావకాల వినియోగంలో ఖర్చును తగ్గించడంతో పాటు, ఉత్పత్తి నాణ్యతను పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఇంటర్నేషనల్ సెమినార్‌లో భాగంగా ప్రదర్శించిన పోస్టర్‌లలో మొదటి బహుమతి రోహిత్ ఫణీంద్ర బండారు, రెండవ బహుమతి అంజిత , మూడవ బహుమతి భవ్యకు అందజేసారు. కార్యక్రమంలో వివిధ దేశాల ప్రతినిధులు, ఐఐటీ మద్రాస్ నుంచి ప్రొఫెసర్ జీ.రమేష్, ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఎం.మధుసూధన్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెంబర్తి లో ఇందిరమ్మ ఇండ్ల ఇంటి ఇంటి సర్వే ను సందర్శించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



హసన్ పర్తి మండలం డిసెంబర్ 13 జనం రిపోర్టర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఇంటి ఇంటి సర్వే లో బాగంగా ఈ రోజు పెంబర్తి గ్రామంలో అకస్మాత్తుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మేడం సందర్శించారు లబ్దిదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు ఇంటి స్థలం ఉండి ఇల్లులేకుండా ఉన్నారో వారికి మొదటి ప్రాధాన్యతగా ఇండ్లు మంజూరీ వస్తుంది, ఇంటి స్థలం లేని వారికి రెండవ దశ మంజూరి అవుతవి అని అన్నారు,హసన్ పర్తి ఎంపిడిఓ జె ప్రవీణ్ కుమార్,ఎంపీఓ కట్ల కరుణాకర్ రెడ్డి, తహసీల్దార్ చల్ల ప్రసాద్, హౌజింగ్ ఇఇ రాజేందర్,

ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు

చైర్మన్ నాగవల్లి శ్రీనివాస్ ప్రత్యేక అధికారి కమిటి సభ్యులు జోరుక పూల,తాళ్లపెల్లి రమాదేవి-రమేష్,గోపాల్,కొయ్యడ సునీల్,సౌరం సుధాకర్,కన్వీనర్ పరకాల హేమలత పంచాయతీ కార్యదర్శి,కారోబార్ చాతల్ల సదానందం, ఇందిరమ్మ ఇండ్ల ఇంటి ఇంటి కి వెళ్ళి వారి వివరాలు ఫోన్ ఆప్ లో నమోదు చేసుకొని,సర్వే చేస్తున్నారు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు అండగా ఉంటా: ఆకుల బాబు

-ఆకుల బాబుకు కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం సోదరులు



**నార్పల/డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** ముస్లిం సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం వెన్నంటి ఉంటానని ముస్లిం సోదరుల ఉద్దేశించి టిడిపి మండల నాయకులు ఆకుల విజయ్ కుమార్ (బాబు) హామీ ఇచ్చారు. నార్పల మండల కేంద్రంలో జనవరి నెలలో జరగనున్న ఇస్తిమా నిర్వహణకు ఆకుల లక్ష్మీపతి స్థలంలో నిర్వహించుకోవడానికి శుక్రవారం పలువురు ముస్లిం సోదరులు టిడిపి కార్యాలయంలో ఆకుల బాబుతో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆకుల బాబు మాట్లాడారు. ముస్లిం సోదరులు తమ ఆధ్యాత్మిక కార్యక్రమమైన ఇస్తిమా తమ స్థలంలో నిర్వహించుకోవాలని కోరడం తనకు సంతోషదాయకమని తెలిపారు. ఇస్తిమా నిర్వహణకు తాను అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఇస్తిమా కార్యక్రమాన్ని ఆకుల లక్ష్మీపతి స్థలంలో నిర్వహణకు ఆకుల బాబు అంగీకరించడంతో ముస్లిం సోదరులు ఆకుల బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ సాలెహా, ఇక్బాల్, అబ్దుల్ రహిమాన్, ముస్తఫా, సమీర్, లడ్డు జిలాన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మండల వెల్ఫేర్ స్కీమ్స్ ప్రత్యేక అధికారి రాజాదే బోరా




**వేటపాలెం /డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వెల్ఫేర్ స్కీమ్స్ ప్రత్యేక అధికారి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజాదే బోరా తెలిపారు. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా భూమి సర్వే చేయాలనీ కోరుతూ నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దారు పి. పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ ఐ కాశీ విశ్వనాథ పంచాయతీ సెక్రటరీ బాలిగ సురేంద్ర, వెలుగు ఎపిఎం కె. అంజిబాబు సచివాల సిబ్బంది, వీఆర్వోలు, సర్వేలు పాల్గొన్నారు

## విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి....

రామగుండం, ఎన్టిపిసి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



**రామగుండం/డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** ప్రభుత్వ పాఠశాలలో చదివి పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం ఎన్టిపిసి లోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... సైన్స్ ఫెయిర్ లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలకు విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన ఆహారం భోజనంగా అందించాలని, ఎటువంటి పొరపాట్లు జరగడానికి వెల్లలేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన వినోదం ఉండాలని, సైన్స్ ఫెయిర్ నిర్వహణ, పర్యాటక ప్రాంతాల చదవాల్సిన వంటి కార్యక్రమాలను ప్లాన్ చేయడం చాలా మంచిదని కలెక్టర్ తెలిపారు. అనంతరం రామగుండం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ , విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్ రావు, మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సదస్సుకు 44 అర్జీలు




(కాకుమాను డిసెంబర్ 13 జనం రిపోర్టర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సులో భాగంగా మండల పరిధిలోని భల్లుఖానుడుపాలెం గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారని మండల తహాశీల్దార్ బి.వెంకటస్వామి శుక్రవారం తెలిపారు.ఈ సదస్సులో 44 అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిలో భూమి కొలతలకు 7అర్జీలు ,భూమి రికార్డులలో నమోదు కు 37అర్జీలు కలిపి మొత్తం 44 అర్జీలు ప్రజల నుంచి అందినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ రిజిస్టార్ కార్యాలయ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.ఈ నెల 17 న గరికపాడులో రెవిన్యూ సదస్సు నిర్వహిస్తామని తహాశీల్దార్ తెలిపారు.

## సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై అధికారులతో ప్రత్యేక సమావేశం



**నార్పల/డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** శింగనమల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న సాగునీటి సంఘం ఎన్నికలపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తహశీల్దార్ బ్రహ్మయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘం ఎన్నికలలో అధికారులు ,పోలింగ్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సిఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ సాగునీటి సంఘం ఎన్నికక పోలింగ్ లో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.వెంటనే చర్యలు తీరుకుంటామని తెలాయజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మల కుమారి,ఎఓ అన్వేష్ కుమార్ ,ఎస్ఐ శరత్ చంద్ర, వివిధ శాఖల అధికారులు,పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక టంగుటూరు ఉరుసు

## ఘనంగా హజరత్ ఖాదర్ వల్లి దర్గా ఉరుసు మహోత్సవాలు

## ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి



నందలూరు/డిసెంబర్ 13(జనం రిపోర్టర్): మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ శ్రీ హజరత్ ఖాదర్ వల్లి దర్గా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఉరుసు మహోత్సవంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా హై స్కూల్ గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను మేడా విజయ శేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్ టంగుటూరు తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు షర్మిల తెదేపా పార్టీ సీనియర్ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, మరియు కమిటీ సభ్యులు ఆయనకు మేళతాళాలు మంగళ వాయిద్యాలు బాణాసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. దర్గా కమిటీ మెంబర్లు శాలువాతో సత్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. టంగుటూరు గ్రామ యువత వేదిక మీద ఏర్పాటుచేసిన భారీ కేకును గ్రామ యువతతో కలిసి మేడా విజయ శేఖర్ రెడ్డి కట్ చేశారు. అనంతరం మేడా మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఉరుసు మహోత్సవానికి వేలాదిమందిగా చుట్టుపక్క గ్రామాల నుండి తరలి వచ్చారని, ఇంత వైభవంగా ఉరుసు నిర్వహించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మతసామరస్యానికి టంగుటూరు ఉరుసు ప్రతీక అని, ప్రతి సంవత్సరం ఖాదర్ వలీ దర్గా ఉరుసు మహోత్సవం గ్రామ ప్రజలు, దర్గా పెద్దలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ప్రతి కార్యక్రమంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల మాజీ ఎంపీపీ భువన బోయిన లక్ష్మీనరసయ్య, పెంచలయ్య, మదన్ మోహన పురం సర్పంచ్ చుక్కయానాది, కోనాపురం ఉపసర్పంచ్ పుల్లయ్య, పాలగిరి మల్లికార్జున్ రెడ్డి, టంగుటూరు కొండయ్య, మాజీ నీటి సంఘం అధ్యక్షులు చుక్క కొండయ్య, ఎల్లమ్మరాజు పల్లి శ్రీనివాసుల రెడ్డి, గుగ్గిళ్ళ సుబ్బరాయుడు, అంబేద్కర్ పాఠశాల చైర్మన్ ఇరువురి మురళి,తోట కృష్ణయ్య, శేఖర్, పాల్గొన్నారు.





# ప్రజల బాగోగులు చూడడమే చంద్రబాబు లక్ష్యం

## ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ/డిసెంబర్ 13(జనం రిపోర్టర్): నేడు స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ (స్వర్ణంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ) ను విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరితో పాటు పలువురు మంత్రులు, కలెక్టర్లు, అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతమని, ఈరోజు ఏపీ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన రోజు అని కొనియాడారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమించారన్నారు. నాడు చంద్రబాబు ఇంటర్నెట్ అంటే నవ్వారని, ఇవాళ పంప్?సెట్?ను కూడా ఇంటర్నెట్ ద్వారా నడిపిస్తున్నారన్నారు. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా సంపాదించే జాబితాలో





తెలుగువాళ్లు ఉన్నారంటే దానికి కారణం చంద్రబాబు అన్నారు. పరిపాలన అంటే ప్రజాభవన్ ను కూల్చేయడం కాదని, ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించే వాడే నిజమైన నాయకుడు అని చంద్రబాబు లాంటి నాయకుడు ఉన్నందుకు తెలుగుజాతి గర్వపడుతోందన్నారు. చంద్రబాబు వ్యక్తిగత లక్ష్యాలేవీ లేవు అని, ప్రజల బాగోగులు చూడడమే చంద్రబాబు లక్ష్యం అని స్పష్టం చేశారు. రోడ్లు, ఐటీ, డ్రిప్ గురించి 30 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారు అని సౌమ్య ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# పెదనందిపాడులో నేడు విద్యుత్ అంతరాయం

(కాకుమాను డిసెంబర్ 13 జనం రిపోర్టర్): పెదనందిపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పెదనందిపాడు, నాగులు పాడు, అనపర్రు, కొప్పర్రు, రాజుపాలెం,పాలపర్రు మరియు అన్నవరం గ్రామాలకు నేడు విద్యుత్ అంతరాయం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి బి వీరాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 09-00 గంటల నుంచి మధ్యాహ్నము 02-00 గంటల వరకు 11%ఖ ఎ% విద్యుత్ లైన్ ల మరమ్మత్తులు మరియు ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయబడును. కనుక వినియోగదారులు సహకరించవలసినదిగా కోరడమైనది.

## నేడు అయ్యప్ప ఆలయంలో

# స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

## దాదాపు 5 కోట్ల వ్యయంతో అయ్యప్ప ఆలయ నిర్మాణం

## నెరవేరిన మూడు దశాబ్దాల ఆకాంక్ష

## భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## శాశ్వత వ్యవస్థాపక ధర్మకర్తలు మొగిలి శ్రీధర్ గౌడ్, గాడి లక్ష్మీనారాయణ



ఆత్మకూర్ వనపర్తి డిసెంబర్ 13 జనం రిపోర్టర్: ఆత్మకూరు పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ ఆకాంక్ష ఈనాటిది కాదని మూడు దశాబ్దాల పట్టణ ప్రజల చిరకాల కోరిక అని అయ్యప్ప స్వామి దేవాలయ శాశ్వత వ్యవస్థాపక ధర్మకర్తలు మొగిలి శ్రీధర్ గౌడ్, గాడి లక్ష్మీనారాయణ అన్నారు. మూడు దశాబ్దాలు ఆకాంక్షను మూడున్నర సంవత్సరాల కాలంలో దాదాపు 5 కోట్ల వ్యయంతో దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించామని వారు అన్నారు. నేడు గురుస్వాముల, వేద పండితుల చేత ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు మండపారాధన, దివ్య పావన పదు నెట్టాంబడి తొలి పాడి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. వేద పండితుల ప్రవచనం ,సర్వ దేవత మండపారాధన అనంతరం తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. వేద పారాయణం యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, కక్ష జ్వాల, గో దర్శనం ప్రాణప్రతిష్ట అనంతరం అయ్యప్ప స్వామి వారికి అభిషేకం, అలంకారము పూర్వాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయని అన్నారు. సాయంత్రం పడిపూజకు ప్రముఖ గాయకుడు జంగి రెడ్డి అయ్యప్ప గానాలహరితో భక్తులను అలరిస్తారని ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



# ఇటుక బట్టి కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య....

## బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ నిర్మూలన, కార్మికుల పిల్లలకు తప్పనిసరిగా విద్య పోలీస్ ప్రధాన ధ్యేయం....

## పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్....

రామగుండం/డిసెంబర్ 13(జనం రిపోర్టర్): ఇటుక బట్టీల్లో పని చేసే వలస కార్మికుల పిల్లలకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా "వర్క్ సైట్ స్కూల్" పేరుతో పాఠశాలలు ప్రారంభించినట్లు రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరీ నిర్మూలన, కార్మికుల పిల్లలకు తప్పనిసరిగా విద్య, పోలీస్ ప్రధాన ధ్యేయంగా ఇటుక



బట్టీలలో పలక బలపం పట్టవల్సిన చిట్టి చేతులు ఇటుక బట్టీలలో తల్లితండ్రులతో కలిసి ఇటుకలను చేస్తూ, మోస్తున్న కార్మికుల పిల్లల పరిస్థితి తెలిసి ఇటుక బట్టి యజమానులతో మాట్లాడి కార్మికుల బాగోవులు చూడడంతో పాటు వారి పిల్లలను కార్మికులుగా



మార్చవద్దని, ఖచ్చితంగా వారికి విద్యాభ్యాసం కల్పించాల్సిందేనని ముఖ్య ఉద్దేశ్యం తో ఏర్పాటు చేసిన "వర్క్ సైట్ స్కూల్" క్లాస్ రూములను పోలీస్ కమీషనర్ పోలీస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సిపి మాట్లాడుతూ... వలస కార్మికులు బతుకు దెరువు కోసం స్వరాష్ట్రం వదిలి వేలాది కిలోమీటర్ల దూరం వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. వారి పిల్లలు సైతం వారి చెంతనే ఉంటూ భవిష్యత్తు కార్మికులుగా మారుతున్నారు. వలస కార్మికులు పొట్ట కోటి కోసం స్వరాష్ట్రం వదిలి ఇటుక బట్టీ లలో పని చేసేందుకు వచ్చారని, కార్మికులతో పాటు వారి పిల్లలు విద్యాభ్యాసం మాని బట్టీల్లో పని చేయడం సరికాదన్నారు. వారికి బంగారు భవిష్యత్తు ఉండాలని, యజమానులతో మాట్లాడి కార్పొరేట్ స్థాయి విద్య అందించాలని పాఠశాలలు ప్రారంభించామన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం పోలీస్ శాఖ నుండి తమ వంతు సహకారం అందిస్తామని, చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని సదుద్దేశంతో ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. ఇక్కడ 70 మంది పిల్లలు ఉన్నారు,వాళ్లకి ఫస్ట్ క్లాస్ నుండి ఫిఫ్త్ క్లాస్ వరకు ఒరిస్సా భాషలో నేర్పించడానికి ఒరిస్సా నుంచి టీచర్లు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిదిలోని ఇటుక బట్టిలలో త్వరలో "వర్క్ సైట్ స్కూల్" ఏర్పాటు చేసేలా చూస్తాం అని సిపి తెలిపారు. విద్యార్థులకు స్వయంగా పుస్తకాలు ఇతర సామాగ్రి





పంపిణీ చేశారు. పిల్లలందరూ మంచిగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలని, పెద్దయ్యాక ఏమవుతారు అని పిల్లలు అడగగా పోలీస్ అని చెప్పారు. వాళ్ళ యొక్క ఆకాంక్షలు నెరవేరాలని పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు చేయాలని కోరుకుంటున్నాను అని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన , పెద్దపెల్లి ఏసిపి జి కృష్ణ, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్, బసంత్ నగర్ ఎస్సై స్వామి,తదితరులు పాల్గొన్నారు.



# ఆల్ ది బెస్ట్.. పరీక్షలంటే భయమొద్దు..

## ఆత్మస్థైర్యం..విజయానికి చిహ్నం

## స్వర్ణాంధ్ర ఏ 2047 ఆవిష్కరణలో నున్న హైస్కూల్ విద్యార్థులతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మాటామంతి

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ /డిసెంబర్ 13(జనం రిపోర్టర్): ఏమ్మా బాగున్నారా.. ఏం చదువుతున్నారు.. ఎక్కడ నుంచి వచ్చారు.. అంటూ విజయవాడ రూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముచ్చటించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో స్వర్ణాంధ్రఏ2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్టేడియం ఆవరణలో ప్రత్యేకంగా పది సూత్రాలు ఒక విజన్ పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తదితరులు సందర్శించారు. విజన్ డాక్యుమెంట్ విడుదలకు ముందు స్టాళ్లను సందర్శించిన వారు అక్కడ పది సూత్రాలు ఒక విజన్ స్టాల్‌లో నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి స్టాళ్లలో నున్న హైస్కూల్ పదో తరగతి విద్యార్థినులు గాజుల సంధ్య, పానకాల భవ్యశ్రీతోపాటు పటమట జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని జ్ఞానప్రసూనతో కొద్దిసేపు వారు మాట్లాడారు. ఎక్కడ నుంచి వచ్చారు, ఏం చదువుతున్నారని ప్రశ్నించగా, తాము నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నట్లు సంధ్య, భవ్యశ్రీ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలపై చంద్రబాబు వారిని ఆరా తీశారు. పరీక్షలకు బాగా ప్రిపేర్





అవుతున్నామని, పాఠశాలలో ఉపాధ్యాయులు తమకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారని వివరించారు. అందుకు ప్రతిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరీక్షలంటే భయం వేయడం లేదా అని ప్రశ్నించగా, ఏమాత్రం భయంలేదని విద్యార్థినులు సమాధానం ఇవ్వడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల గురించి అక్కడే ఉన్న విద్యాశాఖ ఉన్నతాధికారులను కూడా చంద్రబాబు ఆరా తీశారు. అనంతరం ఆ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పి చంద్రబాబు, పవన్ కల్యాణ్ విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమానికి వెళ్లారు. ఇదిలావుండగా, తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా చూడటంపై నున్న హైస్కూల్ విద్యార్థినులు సంధ్య, భవ్యశ్రీ ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల నున్న జిల్లాపరిషత్ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విద్యార్థుల ప్రతిభను గుర్తించి కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సహకారం వల్లే తాము ముఖ్యమంత్రి ప్రారంభించిన విజన్ డాక్యుమెంట్ 2047 కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించడం భవిష్యత్‌లో తమకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సంధ్య, భవ్యశ్రీ వెంట పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ సూరపనేని రవి ప్రసాద్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు సుబ్బారావు ఉన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయడంలో

# కూటమి ప్రభుత్వం విఫలం

## ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్...



/డిసెంబర్ 13(జనం రిపోర్టర్): అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసింది. - నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన రావు. వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తూ పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం మరియు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకుల తో కలసి పాల్గొన్న ఉమ్మడి కృష్ణాజిల్లా శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ , నందిగామ మాజీ శాసనసభ్యులు మొండితోక జగన్మోహన్ రావు. ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు, జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మొండితోక జగన్మోహన్ రావు ను ఇతర నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం, పోలీస్ స్టేషన్లకు తరలించడం జరిగింది. మరో బృందం నాయకులతో కలిసి ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ కలెక్టరేట్లో వినతి పత్రాన్ని అందించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6నెలలు పూర్తయిన రైతులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ తెలుగుదేశం ప్రభుత్వం పై వ్యతిరేకత తారాస్థాయికి చేరుకుందని అన్నారు. పోలీసులతో నిరసనలను అడ్డుకున్నంత మాత్రాన పోరాటం ఆగదని అన్నారు. గత మా ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల, విత్తనాలు ఎరువులు సరఫరా చేశామని, ప్రతి సంవత్సరం రైతు భరోసాను రైతులు ఖాతాలో వేయడం జరిగిందని అన్నారు. పంట నష్ట పరిహారం కూడా తొరితగతిన రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రైతుబంధు పథకం కింద ప్రతి ఒక్క రైతుకు 20వేల రూపాయలు నగదును రైతులకు ఇస్తామని చెప్పి. ఇవ్వకుండా రైతులను నిలువునా మోసం చేశారని అన్నారు. ధాన్యం కొనుగోలులో కూడా ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



# తణుకు సువార్త వారి ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ

ఎటపాక డిసెంబర్ 13జనం రిపోర్టర్: చింతూరు డివిజన్ మండలాలు పరిధిలోని గ్రామలు చుక్కలపాడు, సంగెంపాడు, సిమిలీవాగు,దొరగట్టు, చెరువుబండిరేవు, లక్ష్మీపురం,గద్ధమడుగు, కొత్తపల్లి, మట్టిగూడెం నిరుపేదలకు కృపా గాస్పెల్ చర్చి పాస్టర్ ల సమక్షంలో తణుకు సువార్త బృందం వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఉయిక పిటర్ సింగయ్య, పాస్టర్స్ పాస్టర్ జలకం భీమయ్య ,పాస్టర్ జాన్ పాల్, పాస్టర్ కాక బాబు, పాస్టర్ సున్నం సువర్ణ రాజు, పాస్టర్ జాన్ ,పాస్టర్ యాకోబు ,తణుకు సువార్త పాస్టర్ ల బృందం పాల్గొన్నారు.

## ఎవరైతే చట్టాన్ని గౌరవిస్తారో, పాటిస్తారో

# వారికి మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్...

## పెద్దపల్లి జిల్లాలోని రౌడీ షీటర్స్ కు రామగుండం సీపీ కౌన్సెలింగ్...





రామగుండం /డిసెంబర్ 13(జనం రిపోర్టర్): పెద్దపల్లి లోని స్వరూప గార్డెన్స్ లో రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లాలో రౌడీ షీటర్స్ లలో మార్పులో భాగంగా, మానవీయ కోణంతో "మెరుగైన జీవితం కోసం" అనే నినాదం తో రౌడీ షీటర్స్ లో మార్పు కోసం కౌన్సిలింగ్ నిర్వహించి ఒక అవకాశం ఇస్తున్నామని, రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... ఈరోజు నుండి రౌడీ షీటర్స్ ఉన్న వారు ఎలాంటి కేసులోనైనా, గ్రూపు తగాదాలలో ఐనా ఎవరి ప్రోద్బలంతో, ప్రలోబలతోనైనా నేరాలలో పాలుపంచుకోకూడదు ఈరోజు కౌన్సిలింగ్ హాజరైన వారిలో ఎవరైనా భవిష్యత్తులో నేరాలలో పాలుపంచుకుంటే చట్టం లో ఉన్న ఆక్ట్ ల ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవు అన్నారు. నేర జీవితం వీడి ప్రస్తుత సమాజంతో మంచి జీవితం గడుపుతూ హుందాగా జీవించాలి అని, నేరస్తులు తొందర పాటులో నేరాలు చేసిన, ఎలాంటి తప్పు చేయని వారి కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందని తెలిపారు. రౌడీ షీటర్స్ తన పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని మార్పు తెచ్చుకోవాలని, రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన లక్ష్యంగా స్పష్టమైన ఆదేశాలు జారి చేయడం జరిగింది, దానికి అనుగుణంగా గంజాయి నిర్ములనపై పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా గంజాయి అమ్మిన, కొని సరఫరా చేసిన, అక్రమ రవాణా చేసిన, తాగిన, నిల్వ ఉంచిన, ప్రలోభాలకు గురై భూ కబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం చేయడం, ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై



ఉక్కుపాదం మోపుతామని, చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని పిడి యాక్ట్ అమలు హెచ్చరించారు. ప్రతి ఒక్కరి కదలికలు, చర్యలు మాకు తెలిసిపోతాయాన్నారు. భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తంతో ఉండాలని, నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుండి రౌడి షీట్ ఓపెన్ తరువాత నుండి ఎప్పటి వరకు మీ యొక్క ప్రవర్తన కదలికలు తెలుసుకొని రికార్డ్స్ పరిశిలించి, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన , పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సీఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.త



RNI : APTEL/2023/88525
జనం న్యూస్
తెలుగు జాతీయ దినపత్రిక


### పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో
# బీఆర్ఎస్ కాంగ్రెస్ విఫలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్



అమరచింత వనపర్తి డిసెంబర్ 13 జనం రిపోర్టర్: పేదలకు ఇండ్లు ఇంట్ల స్థలాలు ఇవ్వడంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ ఆరోపించారు. శుక్రవారం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి జబ్బర్ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు తో కలిసి ఆయన అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో ని దుంపాయి కుంటలో గత రెండు సంవత్సరాలుగా పేదలు వేసుకున్న గుడిసెలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం పేదలకు ఇక్కడ 400 మందికి ఇండ్లకు పట్టాలిచ్చి పొజిషన్ చూపలేదని ఆరోపించారు. పొజిషన్ చూపకపోవడంతో పేదలు తమకిచ్చిన స్థలాల్లో రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకున్న గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని సంవత్సర కాలమైన కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్ బాటలోనే నడుస్తుందని ఆరోపించారు. రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు 8 మంది ఎంపీలు ఉన్న ఈ రాష్ట్రానికి ఇందిరా ఆవాస్ యోజన కింద ఇండ్లు మంజూరు కాలేదని ఆరోపించారు. ఏడాదికాలంగా స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఈ సమస్యను పరిష్కరించకపోవడం



విచారకరమన్నారు. ప్రతిసారి తాసిల్దార్లు సర్వే చేయడం నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇస్తామని లబ్ధిదారులను మభ్యపెడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోతే లబ్ధిదారులు ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని శాశ్వత నివాసం ఉంటారని అన్నారు. 400 మంది ఇక్కడ నివాసం ఉంటున్నారని వీరికి విద్యుత్తు మంచినీటి సౌకర్యం అలాగే రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్. ఇక్కడ ఒక ప్రత్యేక ఆశ వర్కర్ ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గసభ్యులు బాల్ రెడ్డి. జిఎస్ గోపి ఎస్ రాజు అజయ్ అనంతమ్మ. బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

### రైతు పరామర్శల పేరుతో... వైసీపీ నేతల విష ప్రచారం
### మాజీ మంత్రి మేరుగా వ్యాఖ్యలపై మండిపడ్డ జన సైనికుడు




రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్ : కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుందని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి నాయకుల తీరును విమర్శించారు. ఈ మేరకు మహేష్ మాట్లాడుతూ గురువారం నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి ప్రాంతాలలో పర్యటించిన వైసిపి మాజీ మంత్రి మేరుగ నాగార్జున కూటమి ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అసత్యాలు, అబద్ధాలను పునాదులుగా చేసుకొని వైసీపీ నాయకులు గత ఐదు సంవత్సరాలు వ్యవస్థలను భ్రష్టు పట్టించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూట కటకుని అధికారం కోల్పోయినా.. వారి తీరు మారకపోవడం విచారకరం అన్నారు. అధికారంలో ఉన్నంతకాలం కన్ను మిన్ను కానకుండా ఇష్టాను సారంగా వ్యవహరించిన అప్పటి వైసిపి పాలకులకు, కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు రైతు పరామర్శల పేరుతో పంట పొలాలను పరామర్శించడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలలకు ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా అమ్మవాడిని వేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోక వచ్చి ఆరు నెలల కే ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రూ.13500 ఇవ్వగా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో జనవరి నెల నుండి రైతు ఖాతాలలో రూ.20 వేల రూపాయలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14000 కాగా కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6000 రూపాయలు అని చెప్పారు ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని క్వింటా ధర రూ.1600 లకు కొనుగోలు చేయగా, నేడు కూటమి ప్రభుత్వం రూ.1720 రూపాయలకు కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే కొంతమంది రైతులు వారి అవసరాల నిమిత్తం కావాలని ఓపెన్ సేల్ మార్కెట్లో తొందరపడి రూ1400, కు అమ్ముకుంటున్న విషయం వారి వ్యక్తిగతమన్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వెంటనే 24 గంటలు గడవక ముందే వారి అకౌంట్లో డబ్బులు పడుతున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైసిపి పాలనలో ధాన్యం అమ్మిన తర్వాత ఎప్పుడు డబ్బులు పడతాయో కూడా తెలియని విపత్కర పరిస్థితులు రైతులు ఎదుర్కొన్నా విషయాన్ని మాజీ మంత్రి మెరుగు నాగార్జున గుర్తించుకోవాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలకు రైతులకు హెక్టార్కు రూ.17వేల అందించారని, అది కూడా కౌలు రైతులకు చెల్లించలేదని గుర్తు చేశారు. ఆ సమయంలో అప్పటి జనసేన పార్టీ అధినేత ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కౌలు రైతులను పరామర్శించి వారికి ఆర్థికంగా అండగా నిలబడ్డ విషయాన్ని ప్రస్తావించారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వ హాయములో సంభవించిన వరదలకు దెబ్బతిన్న పంట పొలాల రైతులకు హెక్టార్ కు రూ .25 వేల రూపాయలు పంట నష్టపరిహారం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఎకరానికి పదివేల రూపాయలు చొప్పున 24 గంటల్లో నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని చెప్పారు. రైతులు సంతోషంగా ఉన్నారని వైసీపీ నేతలే సంతోషంగా లేరనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చమత్కరించారు. రైతుల పట్ల ప్రజల పట్ల సానుకూలంగా మంచితనంతో వ్యవహరించినట్లయితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టే వారు కాదని తమరే అధికారంలో ఉండేవారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాబందుల మాదిరి ప్రజల పైన, వ్యవస్థలపైన పడి రాష్ట్రాన్ని చిన్న భిన్నం చేసిన ఘనత వైసిపి పార్టీదేనని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏ మంత్రి ఎక్కడ ఉన్నాడు తెలియని పరిస్థితులు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్నారని చెప్పారు. ప్రజా క్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ అడుగడుగునా ప్రజలకు అండగా ఉంటూ ముందుకు సాగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక విలువలు వైసీపీ నేతలకు లేవన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఆర్పిలు వేతనాల కోసం పోరాడితే అరెస్టులా...?

### మెప్మా ఆర్పిలను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం...
### ఆర్పీలు లేకుంటే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరవు...
### మద్దెల దినేష్ డిమాండ్...



రామగుండం /డిసెంబర్ 13(జనం రిపోర్టర్): మెప్మా ఆర్పీలకు గత ఆరు నెలల నుండి వేతనాలు రాక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో, చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా మెప్మా కార్యాలయం ముట్టడికి బయలుదేరిన పెద్దపల్లి జిల్లా ఆర్పీలను కరీంనగర్ దగ్గర పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్, ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం.ఏ.గౌస్ అర్పీ మహిళల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని, పోలీసులు మహిళలని చూడకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని వారు అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల పథకాలు ప్రవేశపెడితే అట్టి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అహర్నిశలు ఆర్పీలు కష్టపడుతూ, అనేక కష్టనష్టాలు, ఆర్థిక ఇబ్బందులు పడుతూ ప్రతి పథకం ప్రజలకు చెందేలా, ప్రజలకు తెలిసేలా అహర్నిశలు కృషి చేసేది ఆర్పీలు మాత్రమేనని వారన్నారు. ఆర్పిలకు గత ఆరు నెలల నుండి వేతనాలు రాక అన్ని రకాలుగా కుటుంబ పోషణ భారంగా మారుతున్న తరుణంలో మా వేతనాలు మాకు ఇవ్వండి అని రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని మెప్మా కార్యాలయం ముట్టడిలో భాగంగా పెద్దపల్లి జిల్లా నుండి మెప్మా విభాగం ఆర్పిలు పెద్ద ఎత్తున హైద్రాబాద్ కు వెళుతున్న సందర్భంగా, కరీంనగర్ దగ్గర టోల్గేట్ ప్రాంతంలో



అక్రమంగా పోలీసులు అడ్డుకొని నానా రకాలుగా ఇబ్బందులు పెడుతూ, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రైవేట్ కమ్యూనిటీ హాల్లో ఉంచి కనీసం మంచినీటి సౌకర్యం, భోజనాలు కూడా ఏర్పాటు చేయకుండా అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గపు చర్య అని వారు ఆరోపించారు. అహర్నిశలు ఆర్పీలు కష్టపడుతూ పనిచేస్తున్నవారు కొంతమందికి అనారోగ్యాలు మరియు షుగర్లు, బీపీలు ఉన్నప్పటికీ కనీసం వారి వయసు రీత్య కూడా చూడకుండా అక్రమ అరెస్టులు చేసి ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని, తక్షణమే ఆర్పీల ఖాతాలలో తమ పెండింగ్ వేతనాలు వేయాలని అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్పీలు చేస్తున్న కష్టాన్ని చూసి ప్రభుత్వం స్పందించి వారికి వేతనాలు పెంచాల్సింది పోయి చేస్తున్న పనికి వేతనాలు ఇవ్వాలని ప్రశ్నించి పోరాడుతుంటే అక్రమంగా అరెస్టు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని వారు హెచ్చరించారు. ఆర్పీలు లేకుంటే ప్రభుత్వ పథకాలే లేవని ప్రజల్లోకి చేరయని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అర్పిలకు నిరంతరం డిహెచ్పిఎస్, ఎఐటియూసి అండగా ఉంటుందని వారన్నారు.

## సీపీఎం మండల కార్యదర్శిగా కొండ్ల సూరిబాబు



రాజవొమ్మంగి: డిసెంబర్ 13 జనం రిపోర్టర్: మండలంలోని దుర్గానగరం గ్రామంలో పార్టీ సభ్యులు రామరాజు, సత్యనారాయణ లు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 6వ మహాసభలో సీపీఎం 11మందితో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది.నూతన మండల కార్యదర్శి గా కొండ్ల సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా పెయ్యల పాపారావు, కుంజం జగన్నాథం,టి శ్రీను,మేలిన రమేష్,ఏ మంగ,కె ప్రవీణ్, పి.సత్యనారాయణ, సింగిరెడ్డి అచ్చారావు,పి రామరాజు,తదితరులును మహాసభ ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం నూతన కార్యదర్శి కొండ్ల సూరిబాబు మాట్లాడుతూ.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతానని అన్నారు. సీపీఎం పార్టీ దిశా నిర్దేశాలను పాటిస్తూ నిబద్ధత తో నడుచుకుంటానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## ఈనెల 16.17న సిపిఎం మహాసభలు జయప్రదం చేయండి



రాజవొమ్మంగి: డిసెంబర్ 13 జనం రిపోర్టర్: ఈనెల16,17తేదీలలో రంపచోడవరంలో జరిగే రంపచోడవరం జిల్లా సీపీఎం మొదటి మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని దుర్గా నగరం గ్రామంలో సిపిఎం 6వ మండల మహాసభ పార్టీ మండల కమిటీ సభ్యులు రామరాజు,పొత్తూరి సత్యనారాయణ,కె రమణ అధ్యక్షతన జరిగింది.ఈ మహాసభకు హాజరైన సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు హాజరై మాట్లాడారు.రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలల కాలంలో 634 వేల కోట్ల రూపాయల అక్రమ దందా వ్యాపారం జరిగిందని రూ9.8 కోట్లమేర విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై మోయలేని భారం వేసిందన్నారు.27 వేల కోట్ల రూపాయల కరెంటు చార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని విమర్శించారు.గత వైసిపి ప్రభుత్వం రూ 2.40 పైసలకు యూనిట్ విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసి ఐదు రూపాయలకు పెంచి విద్యుత్ కొనుగోలు చేసి జగన్ ప్రభుత్వం రూ 1750 కోట్ల కమిషన్ దండుకొందన్నారు. ఆదానితో ఒప్పందం కుదుర్చుకొని ఎనిమిది లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేవారు లేరని, చంద్రబాబు ఎన్నికల ముందు అరకులో జీవో నెంబర్ మూడు అమలు చేసి ప్రత్యేక డిఎస్సీని అమలు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. కొమరం భీమ్ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో మన్య ప్రాంతంలో హక్కులకై పోరాటాలకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఢిల్లీలో డబల్ ఇంజన్ సర్కార్ బిజెపి బుల్డోజర్ రాజకీయాలు చేసి ఇళ్ళను కూల్చే పనిలో దూసుకుపోతున్న తరుణంలో సిపిఎం జాతీయ నాయకురాలు బృందా కారత్ అడ్డుపడి ఖబర్దార్ మీ బుల్డోజర్ రాజకీయాలు ఆపాలని తాఖీదు ఇవ్వడంతో బిజెపి తోక ముడిచిందన్నారు. ఎర్రజెండా సత్తా ఏమిటో ఢిల్లీలోనే బట్టబయలైందని ఈ సందర్భంగా తెలియజేశారు.బిజెపి దుర్మార్గాలను రాష్ట్రానికి రావాల్సిన విధులను తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రులు ప్రధాని మోడీని ప్రశ్నించేందుకు భయపడుతున్నారని, వత్తిడి తెస్తే జైల్లోకి పంపుతారేమోనని ఆందోళన చెందటం పరిపాటిగా మారిందన్నారు.ఏపీ అంటే ఆంధ్ర ప్రదేశ్ కాదని ఏ అంటే అమరావతి పి అంటే పోలవరం సమస్యల పరిష్కారానికి పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ దాని ఊసే ఎత్తడం లేదని తెలిపారు.అంబానీ, ఆదానీ లాంటి కోటీశ్వరులకు,బడా పెట్టుబడిదారులకు రూ 3.14 లక్షల కోట్ల రూపాయలు రాయితీలను అందించాలని చూస్తుందన్నారు. గిరిజనులకు ఇచ్చే సబ్ ప్లాన్ నిధులు వారి హక్కులను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా సమిష్టిగా ఎర్ర జెండా సాక్షిగా అందరూ కలిసికట్టి పార్టీని బలోపేతం చేసి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్రపటాలకు పలువురు నాయకులు పూల మాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం జెండాను ఎగురవేసి ప్రజానాట్యమండలి అభ్యుదయ గేయాలను పిఎన్ఎమ్ బృందం ఆలపించారు.అనంతరం జరిగిన సభలో భవిష్యత్తులో జరిగే ఉద్యమ కర్తవ్యాలపై చర్చించారు.అనంతరం 11 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు కొండ్ల సూరిబాబు,సింగిరెడ్డి అచ్చారావ్,రామరాజు, పాండవుల సత్యనారాయణ,ఎం రమేష్.తెల్ల అబ్బాయి, టి శ్రీను,కె జగన్నాథం.కె అప్పలరాజు. సుబ్బారావు,శ్రీను. పెయ్యల పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహా పడిపూజకు రావాలని పిసిసి అధ్యక్షునికి ఆహ్వానం



అమరచింత వనపర్తి డిసెంబర్ 13 జనం రిపోర్టర్: హైదరాబాదులో ఈనెల 17వ తేదీన జరిగే అయ్యప్ప మహా పడిపూజకు రావాలని టిటిసి అధికార ప్రతినిధి కల్లుగీత డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ నాగరాజ్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను శుక్రవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బాదం శివకృష్ణ గౌడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజేందర్ ముదిరాజ్ శ్రీనివాస్ గురు స్వామి యాది గురుస్వామి సంతోష్ గురుస్వామి అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కందుల వెంకట్ రెడ్డి గారి జ్ఞాపకార్థం నిరుపేదలకు భోజనం పంపిణీ



డిసెంబర్ 13 పొదిలి జనం రిపోర్టర్: అన్నం పరబ్రహ్మ స్వరూపం దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిగిలిన భోజనాన్ని సేకరించి నిరుపేదలకు పంపిణీ చేస్తూ వస్తున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు కందుల వెంకట్ రెడ్డి గారి జ్ఞాపకార్థం వారి భార్య పద్మావతి మరియు కూతురు లక్ష్మీ ఛాయా గారు మీరు పేదలకు భోజనం అందించాలని ఒక మంచి ఆలోచనతో దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ వారికి మంచి భోజనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ఈ భోజనాన్ని ఫౌండేషన్ నిర్వాహకులు భద్రపరిచి పొదిలి కాలేజ్ రోడ్డులోని శ్రీపతి నగర్ లో నివసిస్తున్న వందమంది నిరుపేదలకు పంపిణీ చేయడం జరిగింది ఈ భోజనం అందుకున్న నిరుపేదలు మమ్మల్ని గుర్తుపెట్టుకుని భోజనం పంపించిన కందుల వెంకట్ రెడ్డి గారి ని మరియు వారి కుటుంబాన్ని నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించడం జరిగింది దీని సందర్భంగా ఫౌండర్ మాట్లాడుతూ మీ ఇంట్లో కూడా మిగిలిన భోజనాన్ని 8500009928 ఈ నంబరుకు సంప్రదించి అందించినట్లయితే భోజనాన్ని సకాలంలో నిరుపేదలకు పంపిణీ చేస్తామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రాధా, బ్రహ్మారెడ్డి, శ్రీను, గౌస్య, రంగ లక్ష్మి పాల్గొన్నారు

## రైతుకు అండగా వైసీపీ పోరుబాట

### ప్రకాశంలో కదంతొక్కిన వైసీపీ శ్రేణులు
### ఆర్డీఓకు వినతి పత్రం అందించిన జిల్లా నేతలు



(ఒంగోలు డిసెంబర్ 13 జనంరిపోర్టర్ ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి సర్కార్పై పోరుబాటలో భాగంగా, ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉండాలని, రైతులకు సంబందించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా పార్టీ నాయకులు ఒంగోలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు బూచే పల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు సంవత్సరానికి 20 వేలు ఇస్తానని మోసం చేసిందని అన్నారు. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు చేవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పూటకు ఓ బూట కపు మాట మాట్లాడుతుందని ఏద్దేవాచేశారు. ముందుగా అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని ఒంగోలు అంబేద్కర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకూ రైతులతో కలిసి వైయస్ఆర్సీపీ నాయకులు ర్యాలీ గా వెళ్లి ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ లో ఆర్డీఓకు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేయటం జరిగింది

## అన్నదాతకు అండగా కూటమి సర్కార్ పై నిరసన గళం



గుడిబండ డిసెంబర్ 13 జనంరి పోర్టర్ : వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంలో నిర్వహించిన అన్నదాతకు అండగా కూటమి సర్కార్ పై గళం ర్యాలీ నిరసన కార్యక్రమాన్నికి మడకశిర వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ ఈరలక్కప్ప పిలుపుమేరకు గుడిబండ మండలానికి చెందిన వైకాపా నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం ఏడాదికి 20 వేల రూపాయలు ఇవ్వాలి సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందే దళారి వ్యవస్థను తొలగించాలి తడిసిన రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి రైతులకు ఇబ్బంది పెట్టడం మానుకోవాలి ఉచిత పంటల బీమా రైతులపై అదనపు భారం మోపే చర్యలు మానుకోవాలి వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్, మండల్ కన్వీనర్(సర్పంచ్) డి యల్ యంజారేగౌడ్,ఎంపీపీ,రాధమ్మ,సర్పంచులు, మందలపల్లి అశ్వత్,లక్ష్మీనారాయణ,గౌరమ్మశివన్న,రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ గిరిధర్ బీసీ సెల్ పాండు వైకాపా నాయకులు,అనంతరాజు, గుడ్డదహళ్లి నాగరాజు బైరేపల్లి సిద్ధేష్ మాజీ డీలర్లు కరేగౌడ్ తిమ్మేగౌడ్,మంజునాథ్ ఈరన్న రామచంద్ర నటరాజ్ తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## సింగరేణి విశ్రాంత కుటుంబీకులకు
# "రెనోవా హాస్పిటల్ వారి వైద్య శిబిరం...




రామగుండం/డిసెంబర్ 13(జనం రిపోర్టర్): మేడ్చల్ జిల్లా,కొర్రెముల సుప్రభాత్ టౌన్ షిప్ లో రెనోవా బంజారా హిల్స్ హైదరాబాద్ హాస్పిటల్ వారు వంద మంది సింగరేణి విశ్రాంత కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు ఇచ్చినారు. ఈ వైద్య శిబిరంను తెలంగాణా ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సుప్రభాత్ టౌన్ షిప్ యూనిట్ అధ్యక్షులు బంగారి రాజయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం లో డాక్టర్ ఇంతియాజ్ జనరల్ ఫిజిషియన్, డాక్టర్ జవహర్ కార్డియాలాజిస్ట్ సెక్టర్ హిమాకాంత్ ఆర్థో సర్జన్, డాక్టర్ శైలజ స్త్రీ వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ.. నేటి కాలంలో కలుషిత ఆహారం,కలుషిత వాతావరణం వలన ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ వహిస్తూ, జీవన యానం కొనసాగించాలని, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరిక మేరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం చాలా మంచి పరిణామం అని తెలిపారు. ఈ వైద్య శిబిరం లో రెనోవా హాస్పిటల్ వారి కార్పొరేట్ సర్వీసెస్ సీనియర్ మేనేజర్ డి.ఎస్ కృష్ణకుమార్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సలహాదారులు టి.ఉమకర్,వైస్ ప్రెసిడెంట్ బి.రాజయ్య,కె బీరయ్య, ఎం.రాజా నర్సు, లక్ష్మీ నారాయణ, చుక్కల నర్సయ్య,కొట్టే మల్లయ్య,ఎ. ప్రభాకర్, ప్రతాప్ సింగ్,బి.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుసమస్యలపై పోరు బాటలో పాల్గొన్న దద్దాల

### దద్దాల ఆధ్వర్యంలో ఒంగోలుకు కదిలిన వైసిపి శ్రేణులు




(కనిగిరి డిసెంబర్ 13 జనం రిపోర్టర్ ): శుక్రవారం ఒంగోలులో జరిగిన రైతు సమస్యల పోరుబాటలో కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సిఎస్ పురం, పామూరు, పిసి పల్లి మండలాలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యడం జరిగింది. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు దద్దాల నారాయణ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు

## దొనెలపాలెంలో రెవెన్యూ సదస్సు



రాజవొమ్మంగి, డిసెంబర్ 13 జనం రిపోర్టర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సులో భాగంగా మండలంలో గడుఓకుర్తి పంచాయతీ దొనెలపాలెం గ్రామంలో శుక్రవారం రెవిన్యూ సదస్సు మండల తహశీల్దార్ ఎ సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక ప్రజాప్రతినిధులు పంచాయతీ ప్రజల సమక్షంలో నిర్వహించారు ఈ సదస్సులో పలు సమస్యలతో కూడిన వినతులు రెవెన్యూ అధికారులకు అందజేశారు ఈ సదస్సులో వచ్చిన భూ సమస్యలన్నీ తొందరగా పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ చంద్రుడు,ఎంపిటిసి పెద్దిరాజు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కిలో మునక్కాయలు రూ. 400, మండిస్తున్న ఆయిల్ ధరలు

## రాష్ట్రవ్యాప్తంగా నిత్యావసరాల ధరలకు రెక్కలు
## భారీగా పెరిగిన కూరగాయలు, పప్పు దినుసుల రేట్లు
## అకాల వర్షాలతో తగ్గిన దిగుబడి, పెరిగిన ధరలు
## వాపోతున్న పేద, మధ్యతరగతి ప్రజలు
## పుణే మార్కెట్లో కిలో మునక్కాయలు రూ. 400-500



దాదర్: రాష్ట్రవ్యాప్తంగా పప్పు దినుసులు, కూరగాయలు ఇతర నిత్యవసర సరుకుల ధరలకు రెక్కలు వచ్చాయి. మొన్నటి వరకు స్థిరంగా ఉన్న పప్పు దినుసులు, ఉల్లి, వెల్లుల్లి, టమాటా, ఆకుకూరలు, ఇతర కూరగాయల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఒకపక్క మహాయుతి ప్రభుత్వం లాడ్కి బహిన్ పథకం ప్రవేశపెట్టి అక్కచెల్లెళ్లను సంతోషపెడుతూనే మరోపక్క నిత్యవసర సరుకుల ధరలు అందుబాటులో లేకుండా పోయినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారిని ఇబ్బంది పెడుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొన్నటి వరకు నియంత్రణలో ఉన్న ధరలు ఇప్పుడు భారీగా పెరిగిపోవడంతో వీటిని కొనుగోలు చేసేందుకు సాధారణ, మధ్యతరగతి ప్రజలు వెనుకాడుతున్నారు.

### కోస్తే కాదు..కొనాలన్నా కన్నీళ్లే...

ముంబైసహా ఇతర ప్రధాన నగరాలన్నిటిలోనూ ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. న్యూ ముంబైలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) హోల్‌సేల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ.40-60 ఉండగా ఇప్పుడది ఏకంగా రూ.80-100 ధర పలుకుతోంది. నాణ్యతను బట్టి కేజీ రూ.110-120 ధర కూడా పలుకుతోంది. అదేవిధంగా రూ.10-15 ధర పలికిన వివిధ ఆకు కూరలు ఇప్పుడు రూ.30-40 ధర పలుకుతున్నాయి. రాష్ట్రంలోని హోల్‌సేల్ మార్కెట్లోకి ఉల్లి దిగుమతి తగ్గిపోవడంతో సరుకు కొరత ఏర్పడింది. దీనికితోడు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఉల్లి, వెల్లుల్లితోపాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా ధరలు అందుబాటులో లేకుండా పోయాయాని వ్యాపారులు చెబుతున్నారు. కూడా అపార నష్టం వాటిల్లింది. దీని ప్రభావం ధరలపై పడుతోందని వ్యాపారులు అంటున్నారు.

### వంటనూనెలదీ ఇదే దారి...

కూరగాయలు, పప్పుదినుసులతోపాటు వంటనూనెధరలు కూడా విపరీతంగా పెరిగాయి. మొన్నటి వరకు రూ.100-120 ధర పలికిన లీటరు వంటనూనె ప్యాకెట్ ఇప్పుడు ఏకంగా రూ.165 ధర పలుకుతోంది. అలాగే రూ.90 ధర పలికిన పామాయిల్ ఇప్పుడు రూ.130 పలుకుతోంది. సామాన్యులు తినే సాధారణ బియ్యం, గోధుమలు, పప్పుదినుసులు, ఆఖరుకు కొబ్బరికాయల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ఏం తిని బతకాలంటూ పేద, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు.

# ఆర్బీఐ ఆఫీసుకు బాంబు బెదిరింపు.. పోలీసులు అలర్ట్




ఢిల్లీ: దేశంలో బాంబు బెదిరింపుల కాల్స్, మెయిల్స్ తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సైతం ఇలాంటి బెదిరింపులు రావడం ఆందోళన కలిగించింది. ముంబైలోని ఆర్బీఐ కార్యాలయాన్ని పేలుడు పదార్థాలతో పేల్చేస్తామంటూ బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. వివరాల ప్రకారం.. ముంబైలోని ఆర్బీఐ కార్యాలయాన్ని పేలుడు పదార్థాలతో పేల్చేస్తామంటూ శుక్రవారం ఓ మెయిల్ వచ్చింది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధికారిక ఈ-మెయిల్ ఐడీకి ఈ బెదిరింపు రావడం గమనార్హం. అయితే, సదరు మెయిల్‌లో బెదిరింపులు రష్యన్ భాషలో వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీంతో, వెంటనే అప్రమత్తమైన ముంబై పోలీసులు ఆర్బీఐ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ మేరకు ఘటనపై పలు సెక్షన్ల కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మెయిల్ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇక, ఇటీవలి కాలంలో బెదిరింపు కాల్స్, మెయిల్స్ సంఖ్యలో పెరిగింది. ఇవాళ ఉదయం ఢిల్లీలోని దాదాపు 16 పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. గడిచిన నాలుగు రోజుల్లోనే ఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం ఇది రెండో సారి. మరోవైపు.. పలు విమాన సర్వీసులకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది బాంబు బెదిరింపుల సంఖ్య ఏకంగా 900పైగానే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

# సంబంధాల బలోపేతంపై భారత్ దృష్టి



న్యూఢిల్లీ : సరిహద్దు దేశాలతో సంబంధాల బలోపేతంపై భారత్ దృష్టి పెట్టిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. గురువారం తనను కలిసిన నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌తో ఈ విషయాన్ని వెల్లడించారు. 'సరిహద్దు దేశాలకే మొదటి ప్రాధాన్యత' అనే విధానాన్ని భారత్ అవలంభిస్తుందని చెప్పారు. నేపాల్ ఆర్మీ సామర్థ్యాన్ని పెంచడానికి శిక్షణ, విన్యాసాలు, రక్షణ పరికరాల సరఫరా వంటి సహాయాన్ని అందిస్తామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రెండు దేశాల మధ్య ఉన్న ధృడమైన ద్వైపాక్షిక సంబంధాలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ముందుగా గత 70 నుంచి వస్తున్న సంప్రదాయానికి అనుగుణంగా జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌ను భారత ఆర్మీ జనరల్‌గా రాజ్‌నాథ్ సింగ్ గౌరవించారు.

# వాలిబాల్ కు ఎంపికైన విద్యార్థులు



**వేటపాలెం/డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** **త** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాల, విద్యార్థులు జె.యన్.టి.యు కాకినాడ వాలిబాల్ టీం కు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు కరస్పాండెంట్ శ్రీ యస్. లక్ష్మణ రావు సంయుక్తముగా ఒక శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల నరసరావు పేట ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన జె.యన్.టి.యు కాకినాడ సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజి వాలీబాల్ 2024 పోటీలలో యూనివర్సిటి టీం కు జరిగిన సెలక్షన్స్లో కళాశాల విద్యార్థులు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా॥ కె. జగదీష్ బాబు తెలిపారు. ఈ యూనివర్సిటి టీం సెలక్షన్స్లో కళాశాల వాలీబాల్ టీం నుండి జి. తేజ, ఆర్. రమణలు ఎంపికైనట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఇద్దరు విద్యార్థులు ఈ నెల 18 వ తారీఖు నుండి 22వ తారీఖు వరకు యునివర్సిటి ఆఫ్ కేరళలో జరుగ బోయే ఇంటర్ యూనివర్సిటి వాలీబాల్ పోటీలలో జె.యన్.టి.యు కాకినాడ తరపున పాల్గొంటునట్లు తెలిపారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీ అన్నం శ్రీనివాసరావు కళాశాల మేనేజరు శ్రీ ఆర్. వి. రమణ మూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, జి. తేజ, ఆర్. రమ ల టీం ఇంటర్ యూనివర్సిటి వాలీబాల్ పోటీలలో గెలుపొందాలని ఆకాంక్షిచారు.

# విద్యాలయాన్ని క్రైస్తవ మత ప్రార్థన ప్రదేశంగా మార్చిన ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలి



హసన్ పర్తి మండలం డిసెంబర్ 13 జనం రిపోర్టర్: విశ్వహిందూ పరిషత్ వరంగల్ విభాగ్ సహకార్యదర్శి శ్రీరామ్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ టీజీ ఆర్ జె సి హసన్పర్తి లోని టి జి ఆర్ జె సి కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా క్రైస్తవ మత ప్రార్థనలు చేపించిన ప్రిన్సిపాల్ ఇందుమతి నీ తక్షణమే సస్పెండ్ చేయాలి నిబంధనలకు విరుద్ధంగా క్రైస్తవ మత ప్రచారం చేయడం, బయటి నుంచి పాస్టర్లు వచ్చి యధేచ్చగా మత ప్రచారాలు చేయడమే కాకుండా, విద్యార్థులను బలవంతపు మతమార్పిడీలకు ప్రోత్సాహించే విధంగా ప్రతి ఆదివారం కళాశాలలోని ఒక గదిలో ప్రార్థనలు చేయిస్తున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి ఆద్వర్యంలో ఉద్దేశపూర్వకంగానే ఈ మత ప్రచారాలు జరుగుతున్నవి.టి జి ఆర్ జె సి కళాశాల ప్రధాన ద్వారానికి క్రైస్తవ మతానికి సంబంధించిన స్టార్ సింబల్స్ ని ఏర్పాటు చేయడం, క్రిస్మస్ వేడుకల పేరుతో విద్యార్థులకు బైబిల్ ను పంచడంతో పాటు విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేసి గత సంవత్సరం క్రిస్మస్ వేడుకలు నిర్వహించింది. క్రైస్తవ ప్రార్థనలకు హాజరు కాని విద్యార్థులు, అధ్యాపకులపై పక్షపాత ధోరణి వహిస్తూ విరుచుకుపడుతుందని అన్నారు కళాశాల యందు ఇరవై ఒక్క సంవత్సరాలుగా పనిచేస్తూ కళాశాలను మతమార్పిడి కేంద్రంగా తయారు చేసింది. పాఠశాలలో విద్యార్థులకు చల్లదనాన్ని ఇచ్చే వృక్షాలను సైతం నరికి అమ్ముకోవడం జరిగింది. ఎస్సీ నుండి క్రిస్టియన్ గా కన్వర్ట్ అయిన ఇందుమతి తప్పుడు కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగాన్ని సంపాదించిన విషయం, కళాశాలను మత ప్రచారాలకు వేదికగా మార్చిన టి జి ఆర్ జె సి ప్రిన్సిపల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర కార్యదర్శి వెలగందుల రాజు మాట్లాడుతూ టీజీ ఆర్ జె సి కళాశాలలో మత ప్రచారం చేస్తున్న విషయాన్ని తెలుసుకొని వీడియో చిత్రిస్తున్న జర్నలిస్టులపై కళాశాల ప్రిన్సిపల్ ఇందుమతి కుట్రకోణం తెలుస్తుందని అన్నారు. అమాయకమైన విద్యార్థులకు బైబిల్ ని పంచడం బైబిల్ చదవాలని ఒత్తిడి గురు చేయడం ముమ్మాటికి హేయమైన చర్య అని అన్నారు. విషయాన్ని తెలుసుకుని వీడియో చిత్రీకరిస్తున్న విలేకరులపై కేసులు పెట్టడాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తుంది ఈ పత్రికా విలేకరుల సమావేశంలో సహ కార్యదర్శి సందీప్ రెడ్డి, నాగుల ప్రసాద్, గోరక్ష ప్రముఖ నంగునూరు నాగరాజు, బజరంగ్ దళ్ సంయోజక్ బండి రోహిత్ యాదవ్, కనుకుంట్ల వెంకట్, పత్తిపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు

# వక్క చెట్లు నరికిన పాపాత్ములు



మడకశిర డిసెంబర్ 13 జనం రిపోర్టర్ : మరాపురం మండలంలో హేమావతి గ్రామ పంచాయతీ గుణేహళ్ళి గ్రామానికి చెందిన రైతు నంజుండ, ఈరన్న, క్రిష్ణప్ప పొలంలో వక్కచెట్లు నరికి వేసిన గుర్తు తెలియని దుండగులు దాదాపు 200 పైగా వక్కచెట్లు నరికివేశారు ఇలాంటి విష సంస్కృతి సరైనది కాదు,రైతులు పడే కష్టం విలువ తెలిసిన వారు ఎవ్వరు కూడ ఇలాంటి దుర్మార్గమైన పని చేయరు తమ పిల్లలను పెంచుకున్న విధంగా చెట్లను పెంచుకున్నాము అని కన్నీరు పెట్టుకున్నారు రైతుల కుటుంబాలు,,ఈ దారుణమైన పని చేసిన వారిని గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు

# కమీషనరేట్ పరిధిలోని గ్రూప్ -1 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 భారతీయ నాగరిక్ సురక్ష సంహిత అమలు...

-పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్..



**రామగుండం/డిసెంబర్ 13(జనం రిపోర్టర్):** డిసెంబర్ 15,16 తేదీలలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (టీజీపీఎస్సి) ఆధ్వర్యంలో జరగనున్న గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 భారతీయ నాగరిక్ సురక్ష సంహిత యాక్ట్ - 2023 అమలులో వుంటుందని, శుక్రవారం రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15,16 తారీఖులలో రామగుండం పోలీస్ కమీషనరేట్ వ్యాప్తంగా మొత్తం 23,969 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, అందులో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 18 పరీక్షా కేంద్రాలలో 9018, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 48 పరీక్షా కేంద్రాలలో 14,951 మంది హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్-%××% పరీక్షల సందర్భంగా డిసెంబర్ 15 ఉదయం 6:00 గంటల నుంచి డిసెంబర్ 16 సాయంత్రం 6:00 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. పోలీస్ అధికారులు,సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 300 మీటర్ల దూరంలో గుంపులుగా వుండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. పరీక్షా సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదే విధంగా పరీక్షా సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ తెలిపారు.

# రైతులకు న్యాయం చేసే దుకు జిల్లాకలెక్టర్ కు వినతి పత్రం



రేపల్లె డిసెంబర్ 13 జనం రిపోర్టర్: గౌ" రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వంలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు మరియు రైతులకు న్యాయం చేయమని బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి శుక్రవారం రైతు సోదరులతో పది ట్రాక్టర్లు, 20 కారులు మరియు 100 బైకులతో భారీ ర్యాలీగా బయలుదేరిన రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డా"ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో బాపట్లకు బయలు దేరి వెళ్లారు ఈ కార్యక్రమంలో జి ప్రశాంత్ కుమార్, కృష్ణారెడ్డి, చిమాట బాలాజి .చిత్రాల ఒబేదు,ఈవూరు సృజన్ ,చదలవాడ శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు

# సిరియాలో అనిశ్చితి!




డిసెంబరు ఎనిమిదో తేదీన అధ్యక్షుడు అసాద్ పదవి నుంచి తప్పుకొని రష్యాలో ఆశ్రయం పొందటం, టర్కీ మద్దతు ఉన్న హయత్ తహ్రిర్ అల్ షామ్(హెచ్‌టిఎస్) సాయుధ బృందం అధికారాన్ని చేపట్టడంతో దశాబ్దాలుగా అంతర్యుద్ధంలో ఉన్న సిరియాలో మరో అధ్యాయం మొదలైంది.ఇప్పటికే చింపిన విస్తరిలా తలా ఒక ప్రాంతాన్ని అదుపులో ఉంచుకున్న శక్తుల పాత్ర ఏమిటో స్పష్టంగాక ముందే ఇజ్రాయిల్ మరోసారి దాడులకు తెగబడింది. అక్కడ అసలేం జరుగు తోందో వివరాలు బయటి ప్రపంచానికి తెలియటం లేదు. రకరకాల వ్యాఖ్యానాలు, వార్తలు వెలువడుతూ గందరగోళంలోకి నెడుతు న్నాయి. పొంతన లేని ఈ సమాచారంలో ఏది నిజమో, ఏది కాదో వెంటనే నిర్ధారించటం కష్టం. కొత్తగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని నాలుగు రోజులు గడిచిన తరువాత కూడా ఏ దేశమూ గుర్తించ లేదు. పశ్చిమా సియా, మధ్య ప్రాచ్యంలో భాగమైన సిరియాతో సరిహద్దులు కలిగి ఉన్న టర్కీ, ఆర్మీనియా, ఇరాన్, ఇరాక్, సిరియాలలో కర్దులు అనే తెగ నివసించే ప్రాంతాలతో కలిపి మధ్యలో కర్దిస్తాన్ ఏర్పాటు చేయాలన్నది అమెరికా దీర్ఘకాలిక ఎత్తుగడ. దాన్ని కేంద్రంగా చేసుకొని ఆ ప్రాంతం మీద పూర్తి అదుపు కలిగి ఉండాలని చూస్తున్నది. కర్దుల ప్రాంతాలలో కొన్ని న్యాయమైన సమస్యలున్న మాట నిజం. వాటికి స్వయంపాలిత ప్రాంతాల ఏర్పాటుతో సహా ఆయా దేశాల పరిధిలో పరిష్కారం చూడాలన్నది ఒక అభిప్రాయం. ఎట్టి పరిస్థితుల్లో ప్రత్యేక దేశ ఏర్పాటు కాకూడదని ఆయా దేశాలు, ఏది ఏమైనా తమకు ఒక మాతృభూమి ఉండాలని కర్దులు దశాబ్దాల తరబడి సాయుధ పోరాటం చేస్తున్నారు, అణచివేతకు గురవుతున్నారు. సిరియాలో తన పథకాన్ని అమలుచేసేందుకు కర్దులతో పాటు ఐఎస్, ఆల్‌ఖైదా వంటి తీవ్రవాద సంస్థలను అమెరికా ప్రోత్సహిస్తున్నది, వందల కోట్ల డాలర్లు, ఆయుధాలను కుమ్మరిస్తున్నది. ఆక్రమంలోనే సిరియాలో చమురు, గ్యాస్ నిల్వలు, పంటలు పండే ప్రాంతాలను ఫ్రీ సిరియన్ ఆర్మీ సాయుధుల పేరుతో అమెరికా ఆక్రమించటమే గాక అక్కడ మిలిటరీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన హెటిఎస్ సాయుధులు టర్కీ మద్దతుతో ఎప్పటి నుంచో కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. మరోవైపు గోలన్ గుట్టల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. ఇటీవలి వరకు అధికారంలో ఉన్న అసద్ ప్రభుత్వ మిలిటరీ, మద్దతు ఇచ్చే సాయుధ బృందాల ఆధీనంలో రాజధాని డెమాస్కస్, తదితర ప్రాంతాలు ఉన్నాయి. అసద్‌కు రష్యా, ఇరాన్ దేశాలతో పాటు హిజబుల్లా సాయుధ సంస్థ మద్దతు ఉన్న సంగతి తెలిసిందే. హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది, దాని నేత జొలానీని గతంలో అరెస్టు చేసి జైల్లో పెట్టింది. అతను గతంలో ఆల్‌ఖైదాలో ఉన్నమాట ఎంత నిజమో తరువాత దానితో విభేధించింది కూడా అంతే నిజం. అనేక ఛాందసవాద బృందాలను అంతమొందించినట్లు కూడా చెబుతారు. అమెరికా మద్దతు ఉన్న కర్దు తిరుగుబాటుదార్లు, ఐఎస్ తీవ్రవాదులను టర్కీ వ్యతిరేకిస్తున్నది. సిరియాలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన తప్ప ఇంకా అది కుదురుకోలేదు. ఇప్పటి వరకు అసద్ ప్రభుత్వాన్ని కూలదోయాలనే ఏకైక అజెండాతో పని చేసిన సంస్థలు ఇప్పుడు అధికారం కోసం కుమ్ములాడు కుంటాయా? పాలన సజావుగా సాగేందుకు అవకాశమిస్తాయా అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. లిబియాలో తమను వ్యతిరేకించిన గడాఫీ సర్కార్‌ను కూలదోసేందుకు నాటో కూటమి అనేక సంస్థలను ప్రోత్సహించింది. ఇప్పుడవి తమలో తాము కుమ్ములాడు కుంటున్నాయి. సిరియాలో కూడా అదే జరుగుతుందా ? అసద్ రాజీనామా చేసి ప్రవాసం వెళ్లటం వెనుక ఒక అవగాహన ఉందంటూ కొందరు చెబుతున్నారు. ఆ కారణంగానే మిలిటరీ ఎలాంటి ప్రతిఘటన లేకుండా రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకొనేందుకు వీలు కల్పించిందని అంటున్నారు. తాము మద్దతిస్తున్న సాయుధ సంస్థలకు సిరియాను స్వాధీనం చేసుకొనే సత్తాలేనందున అమెరికా కూడా చూసీచూడనట్లు ఉందనేది మరొక అభిప్రాయం. అయితే అదే వాస్తవమైతే తాజాగా సిరియా మీద వందలాది వైమానిక దాడులు జరుపుతున్న ఇజ్రాయిల్ వెనుక అమెరికా హస్తం లేకుండా ఉంటుందా? సిరియాలో విజయం సాధించింది టర్కీ అని, రానున్న రోజుల్లో దాని పచర్య లుకుబడి అక్కడ కొనసాగుతుందంటు న్నారు. ఈ పరిణామాన్ని అమెరికా అంగీకరిస్తుందా ? టర్కీతో రష్యాకు కొన్ని సమస్యలున్నప్పటికీ అమెరికా ఆంక్షలను ధిక్కరించి ఎస్ 400 క్షిపణి రక్షణ వ్యవస్థలను టర్కీ కొనుగోలు చేసింది.ఇప్పటి వరకు సిరియా ద్వారా హిజబుల్లా మిలిటెంట్లకు ఇరాన్ అందిస్తున్న ఆయుధసాయం కొనసాగుతుందా? వీటన్నింటినీ చూసినపుడు రానున్న రోజుల్లో సిరియాలో ఏం జరగనుందన్నది పెద్ద ప్రశ్న.

# అవినీతి చెద... అన్ని శాఖలూ అవినీతిమయమే



## అరికట్టడంలో వైఫల్యం

గత సంవత్సరపు అవినీతి సూచికలో మన దేశం ఏకంగా 17 స్థానాలు కోల్పోయింది. దేశాన్ని, రాష్ట్రాలను పాలించిన ప్రతి పార్టీ తాను అవినీతిని చాలా వరకూ నిర్మూలించానని గొప్పలు చెప్పుకుంటుంది. అయితే అవినీతి సూచికలో భారత్ ర్యాంక్ భారీగా పతనమవడాన్ని గమనిస్తే అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. అవినీతికి వ్యతిరేకంగా దేశంలో 2012లో ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు అదే ప్రధానాంశంగా నిలిచింది. పరిపాలనలో పెచ్చరిల్లిన అవినీతి జాడ్యంపై చర్చోపచర్చలు సాగాయి. మరి గడచిన పుష్కర కాలంలో దేశంలో అవినీతి తగ్గిపోయిందా అంటే లేదనే చెప్పాల్సి ఉంటుంది. పొరుగు దేశాలైన చైనా, భూటాన్, సింగపూర్, మలేసియా ఈ సమస్యను ఎదుర్కోవడంలో మంచి విజయాలు సాధిస్తే మనం ఎందుకు విఫలమవుతున్నాము?

ఏ దేశ చరిత్ర చూసినా

భారత్‌లో అవినీతిపై గత సంవత్సరం టీఐ సంస్థ ఓ అధ్యయనం నిర్వహించింది. ఇందుగలడందు లేదన్నట్లు దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు పోలీస్, రెవెన్యూ,దిగువ స్థాయిలోని న్యాయ వ్యవస్థ, విద్య, ఇంజినీరింగ్ ఇలా అన్ని శాఖలూ అవినీతి నిలయాలుగా మారాయని టీఐ స్పష్టం చేసింది. దేశంలో ఆర్థిక వ్యవస్థ విస్తరించ బడుతుంటే జాతీయ రహదారులు, విద్యుత్ ప్లాంట్లు, విమానాశ్రయాల ఆధునీకరణ, కొత్త ఓడరేవులు, భారీ గృహనిర్మాణ పథకాలు, పట్టణీకరణ ప్రాజెక్టులు ఇలా అనేక మౌలిక సదుపాయాలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఈ ప్రాజెక్టులలో భారీగా అవినీతి చోటుచేసుకుంటోంది.

న్యూఢిల్లీ : సంపన్న దేశాలతో పాటు వర్ధమాన దేశాలు కూడా అవినీతి సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నాయి. అమెరికాలోని పలు రైల్‌రోడ్డు ప్రాజెక్టుల్లో అవినీతి చోటుచేసుకుంది. నిషిద్ధ కాలంలో అమెరికా పోలీసు వ్యవస్థకు అవినీతి చెద పట్టింది. 1970వ దశకంలో హాంగ్‌కాంగ్‌లో 'టీ మనీ' ముడుపుల వ్యవస్థ ఉండేది. సొమ్ము ముట్టజెబితేనే ప్రాథమిక సేవలు అందుబాటులోకి వచ్చేవి. టెలిఫోన్లను ఒక చోటు నుండి మరో చోటికి మార్చడంతో మొదలుకొని అగ్నిప్రమాదం జరిగినప్పుడు సిబ్బంది రావడం వరకూ ప్రతి సేవకూ అధికారులకు ఆమ్యామ్యాలు సమర్పించాల్సిందే. ఇక జపాన్‌లో లాక్‌హెడ్ విమాన కాంట్రాక్టులు పొందేందుకు భారీగా డబ్బు ముట్టజెప్పారు. ఈ కుంభకోణం అప్పటి ప్రధాని కాకీ తనాకా అరెస్టుకు దారితీసింది. ఆయన నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. జర్మనీ రక్షణ మంత్రి పైన, నెదర్లాండ్స్ రాకుమారుడి పైన వచ్చిన అవినీతి ఆరోపణలు వారి రాజకీయ జీవితాన్ని బాగా దెబ్బతీశాయి. అప్పటి నుండి చాలా దేశాలు రక్షణ చర్యలు చేపట్టి తమ సమాజాలకు అవినీతి చీడ అంటకుండా జాగ్రత్త పడ్డాయి.

దిగజారుడే

వివిధ దేశాల్లో అవినీతి ఏ మేరకు ఉన్నదనే విషయాన్ని గుర్తించేందుకు ప్రామాణికమైన పద్ధతి అంటూ ఏదీ లేదు. అయితే ప్రపంచంలో ప్రధానంగా రెండు సంస్థలు అవినీతిపై సమాచారాన్ని ప్రచురిస్తున్నాయి. అవే ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ), ప్రపంచబ్యాంక్. ప్రపంచబ్యాంక్ తన పరిపాలనా సూచికలో భాగంగా అవినీతి సమాచారాన్ని అందిస్తోంది. 2023లో అవినీతి సూచికలో భారత్ స్థానం 93 (మొత్తం దేశాలు 180). 2018లో ఈ ర్యాంక్ 85గా ఉండేది. 2016లో మన దేశం 79వ ర్యాంకులో ఉంది. అంటే ప్రతి సంవత్సరం అవినీతిలో భారత్ ర్యాంక్ దిగజారుతోందే తప్ప మెరుగుపడుతోంది లేదు. దీనిని బట్టి అర్థమవు తోంది ఏమిటంటే గత కొన్ని సంవత్సరాల కాలంలో దేశంలో అవినీతి పెరగడమో లేదా ఇతర దేశాలు తమ పరిస్థితిని మెరుగుపరచుకోవడమో జరిగింది.

ఫలితమివ్వని ఉద్యమం

అవినీతిని అదుపు చేయడంలో వైఫల్యం చెందడం మరో కోణం నుండి కూడా ఆందోళన కలిగిస్తోంది. 2012-13లో అవినీతిపై పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ప్రజా బాహుళ్యం కలిగిన శక్తివంతులైన నేతలు అందులో భాగస్వాములయ్యారు. రాజకీయాలలో సమూల మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని ప్రజలకు నొక్కి చెప్పారు. అవినీతి కేసుల విచారణ కోసం లోకాయుక్తతో పాటు లోక్‌పాల్ తరహా వ్యవస్థ ఉండాలన్న చర్చ జరిగింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కర్నాటకలో మినహా మరెక్కడా లోకాయుక్త లేదు.

వైఫల్యానికి కారణమేమిటి?

అవినీతిని అరికట్టడంలో భారత్ ఎందుకు విఫలమవుతోంది? ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ పార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు పెడతాయి. రాజకీయ పార్టీలకు ప్రైవేటు రంగం విరాళాలు అందిస్తుంది. ఇక్కడే క్విడ్ ప్రోకో మొదలవుతుంది. తమకు భారీగా విరాళాలు ముట్టజెప్పే కంపెనీలు, సంస్థలకు పాలకులు వివిధ కాంట్రాక్టులు కట్టబెడుతుంటారు. సెంటర్ ఆఫ్ మీడియా స్టడీస్ అంచనా ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీలు కలిసి రూ.50,000 కోట్లు ఖర్చు చేశాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఈ వ్యయం లక్ష కోట్లకు చేరిందని అంచనా. ఇదంతా రాజకీయ నాయకులు సంపాదించిన అవినీతి సొమ్మే. సామాన్యులు తమ అవసరాల కోసం అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి లంచాలు, చిన్న చిన్న బహుమతులు సమర్పించుకోవడం సర్వసాధారణమై పోయింది. ఈ జాబితాలో ఏసీలు, మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువులు ఉంటున్నాయి. బడా బాబులు కాంట్రాక్టులు పొందేందుకు అధికార గణానికి భారీగానే సొమ్ము ముట్టజెబుతుంటారు. అందుకే అధికారుల దృష్టంతా కాంట్రాక్టులు, ప్రాజెక్టుల పైనే ఉంటుంది. పెద్ద ఎత్తున లంచాలు అందుకునే అవకాశం వాటిలోనే ఉంటుంది మరి. పైగా పట్టుబడే అవకాశాలు పెద్దగా ఉండవు. అభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులు అవసరమే. అయితే ఈ తరహా పెట్టుబడులు అవినీతిని ప్రోత్సహిస్తాయి. ఈ పరిణామాలన్నీ అవినీతిని పెంచి పోషిస్తున్నాయి.

# స్పోర్ట్స్ న్యూస్



## ఆనంద్ వారసుడొచ్చాడు..18 ఏళ్లకే చెస్ ప్రపంచ చెస్ చాంపియన్..

2024 పోతూ పోతూ భారత క్రీడా రంగానికి అద్భుతమైన బహుమతి ఇచ్చింది. ఎంతోకాలంగా సాధ్యం కాని.. రికార్డును అందించింది. ప్రపంచ చదరంగంలో భారత కీర్తి పతాక మరోసారి రెపరెపలాడింది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మరో చాంపియన్ ఎప్పుడొస్తాడా? అని ఎదురుచూసిన అభిమానులకు ఆ లోటు తీరింది. అంతేకాదు.. భవిష్యత్ చెస్ ధ్రువతార తానేనని చాటుతూ 18 ఏళ్ల యువకుడు దూసుకొచ్చాడు. / వచ్చేశాడు మొనగాడు.. భారత్ కు చెందిన దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ చాంపియన్ షిప్ విజేతగా నిలిచాడు. అది కూడా డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)ను ఓడించి మరీ. 14 రౌండ్ల పాటు జరిగిన ఈ చాంపియన్ షిప్ లో గుకేశ్ 7.5-6.5 పాయింట్ల తేడాతో లిరెన్ ను మట్టికరిపించాడు. దీంతో గుకేశ్ 18 ఏళ్ల అత్యంత చిన్న వయసులోనే ప్రపంచ చాంపియన్ అయిన ఘనతను అందుకున్నాడు.ఆనంద్ తర్వాత ఇతడే.. కోనేరు హంపి, పెంట్యేల హరిక్రిష్ణ, ద్రోణవల్లి హారిక తదితర ప్రతిభావంతులైన ఆటగాళ్లకు సాధ్యం కాని దానిని 18 ఏళ్ల గుకేశ్ సాధించాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చాంపియన్ అయిన భారతీయుడిగా రికార్డులకెక్కాడు. అంతేకాదు.. అత్యంత చిన్న వయసులో ప్రపంచ చాంపియన్ అయిన ఆటగాడు కూడా ఇతడే. దీంతో అత్యంత అరుదైన ఘనతను అందుకున్నాడు. 14 రౌండ్ల పాటు.. ప్రపంచ చెస్ చాంపియన్ షిప్ 14 రౌండ్ల పాటు సాగింది. గురువారం చివరి రౌండ్ జరిగింది. 13 రౌండ్ల అనంతరం గుకేశ్, లిరెన్ 6.5 పాయింట్లతో సమంగా ఉన్నారు. గురువారం చివరి క్లాసికల్ గేమ్ లో గుకేశ్ గెలిచాడు. దీంతో ప్రపంచ చాంపియన్ అయ్యాడు. ఒకవేళ ఈ గేమ్ డ్రాగా ముగిసి ఉంటే గుకేశ్, లిరెన్ 7-7తో సమంగా ఉండేవారు. దీంతో విజేతను నిర్ణయించేందుకు తక్కువ కాల వ్యవధి కలిగిన గేమ్ ల టైబ్రేక్ నిర్వహించాల్సి వచ్చేది. అయితే, ఆ అవకాశం లేకుండా గుకేశ్ టైటిల్ కొట్టేశాడు.

## బాబర్..జైశ్వాల్ కాదు..
## ప్రస్తుతం నంబర్ 1 టెస్టు బ్యాట్స్ మన్ అతడే

క్రికెట్ లో టి20లు, వన్డేలు.. వీటిలో ఎంత ప్రతిభ చూపినా ఆటగాడిని (బ్యాట్స్ మన్ లేదా బౌలర్) మేటిగా లేదా లెజెండ్ గా పరిగణించరు. కేవలం టెస్టుల్లో రాణిస్తేనే.. అది కూడా నిలకడగా ప్రదర్శన చేస్తేనే ఆ క్రికెటర్లను చరిత్రలో గొప్పవారిగా కీర్తిస్తారు. రికార్డు పుస్తకాల్లో చోటిస్తారు. ప్రస్తుతం టెస్టు క్రికెట్ లో అలాంటివారు నలుగురు ఉన్నారు. వారే.. విరాట్ కోహ్లి (భారత్), జో రూట్ (ఇంగ్లండ్), స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా), కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్). వీరంతా వేర్వేరు దేశాలకు చెందినవారు కావడం ఓ విషయమైతే.. 2008 అండర్-19 ప్రపంచ కప్ లో తమ తమ దేశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత జాతీయ జట్లకు ఎంపికై ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆటగాళ్లుగా ఎదిగారు. అందుకనే వీరిని ఫ్యాబ్ -4గా కొనియాడుతుంటారు. అయితే, వీరిలో టాప్ ఎవరో చెప్పడం కష్టం. / బాబర్.. జైశ్వాల్.. కమిందు..? పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్, శ్రీలంక నయా సంచలనం కమిందు మెండిస్, టీమ్ ఇండియా యువ కెరటం యశస్వి జైశ్వాల్.. ప్రపంచ క్రికెట్ లో టాప్ బ్యాట్స్ మన్ గా ఉన్నవారు వీరు. అయితే, వీరందరికంటే మొనగాడు ఒకడున్నాడు. అతడే ఇంగ్లండ్ మిడిలార్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్. ఈ విషయాన్ని చెప్పింది కూడా జో రూట్ కావడం గమనార్హం. 23 టెస్టులు 8 శతకాలు.. బ్రూక్ వయసు 25. మూడేళ్ల కిందట అరంగేట్రం చేసిన అతడు ఇప్పటివరకు 23 టెస్టులు ఆడాడు. వీటిలో 8 సెంచరీలు కొట్టాడు. తాజాగా న్యూజిలాండ్ తో టెస్టు సిరీస్ లో వరుసగా రెండు మ్యాచ్ లలో సెంచరీలు బాదాడు. మూడేళ్లలో 23 మ్యాచ్ ల్లోనే 8 శతకాలు సాధించడం విశేషం. న్యూజిలాండ్ తో క్లిష్ట పరిస్థితుల్లో బ్యాటింగ్ కు దిగిన అతడు తొలి టెస్టులో భారీ శతకం (171బీ 191 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్ లు) బాదాడు. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్ లో 123 (115 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్ లు) చేశాడు. రెండో ఇన్నింగ్స్ లో హాఫ్ సెంచరీ (55) కొట్టాడు. టెస్టుల్లో నంబర్ వన్ దిశగా.. త్వరలో బ్రూక్ (854 పాయింట్లు) ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ లో టాప్ నకు చేరువగా ఉన్నాడు. జో రూట్ (895 పాయింట్లు) మొదటిస్థానంలో ఉన్నాడు. బ్రూక్ 23 టెస్టుల్లోనే 61.62 సగటుతో 2,280 పరుగులు చేయడం గమనార్హం. దీంతోనే బ్రూక్ ను నంబర్ వన్ అంటున్నాడు రూట్.. ఒత్తిడిని తట్టుకొని ఆడతాడని.. మైదానంలో అన్నివైపులా షాట్లు కొడతాడని.. అతడి తల మీదుగా స్కూప్ షాట్ తో సాధించే సిక్స్ అద్భుతం అని కొనియాడాడు. మరోవైపు రూట్ కూడా సూపర్ ఫామ్ లో ఉన్నాడు. 151 టెస్టుల్లో 12,886 పరుగులు చేశాడు. టాప్ రన్ స్కోరర్స్ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. మరో 492 పరుగులు చేస్తే పాంటింగ్ (13378), కలిస్ (13289), ద్రవిడ్ (13288)ను దాటేస్తారు. సచిన్ (15,921)ను అందుకోవడం మాత్రం కష్టమే అని చెప్పారు.





## లుక్ బ్యాక్ స్పోర్ట్స్: కోహ్లి-రోహిత్..
## చాంపియన్ల నుంచి వైఫల్యం దాకా!

విరాట్ కోహ్లి.. రోహిత్ శర్మ.. సమకాలీన భారత క్రికెట్ లో దిగ్గజాలు.. టి20లు, వన్డేలు, టెస్టులు.. ఫార్మాట్ ఏదైనా, పిచ్ ఎలాంటిదైనా పరుగుల వరద పారించే బ్యాట్స్ మెన్. మధ్యమధ్యలో కాస్త బ్రేక్ లు వచ్చినా.. 2007లో మొదలైన రోహిత్ శర్మ ప్రస్థానం.. 2008లో ప్రారంభమైన విరాట్ కోహ్లి పరుగు 2024 వరకు ఎక్కడా ఇబ్బంది ఎదురవలేదు. కానీ, ఈ ఏడాది మాత్రం 'ముగింపునకు వచ్చేసినట్లే' అనిపించింది. / ఇద్దరూ చాంపియన్లే.. ఆధునిక క్రికెట్ టి20ల్లోనూ విరాట్, రోహిత్ ల సత్తా ఏమిటో అందరూ చూసిందే. 2008 ఐపీఎల్ నుంచి వీరిద్దరూ ప్రతి సీజన్ లోనూ ఆడుతున్నారు. 2025 సీజన్ లోనూ ప్రాతినిధ్యం వహించనున్నారు. అయితే, 2024 మాత్రం ఇద్దరికీ మధురమైనది. ఎందుకంటే టి20 ప్రపంచ కప్ గెలవడంతోనే. వాస్తవానికి అప్పటికే ఈ ఫార్మాట్ కు దూరమైన ఇద్దరినీ అనూహ్యంగా ఎంపిక చేశారు. దానికి ప్రతిఫలంగా ప్రపంచ కప్ అందించారు. ఆ వెంటనే టి20లకు రిటైర్మెంట్ ప్రకటించారు. జూనియర్ గా 2007 తొలి టి20 ప్రపంచ కప్ నెగ్గిన టీమ్ ఇండియా సభ్యుడైన రోహిత్.. అత్యంత సీనియర్ గా కెప్టెన్ హోదాలో 2024లో కప్ కొట్టాడు. ఇక కోహ్లి.. 2011 వన్డే ప్రపంచ చాంపియన్ జట్టులో జూనియర్ సభ్యుడు. ఇప్పుడు టి20 ప్రపంచ కప్ గెలిచిన టీమ్ లోనూ ఉన్నాడు. వన్డేలకు వీడ్కోలే? రోహిత్ కు 37 ఏళ్లు నిండుతున్నాయి. విరాట్ కు 36 ఏళ్లు నిండాయి. ఇప్పటికే వీరిద్దరి ఫామ్ ఆందోళనకరంగా ఉంది. దీంతో వన్డేల నుంచి క్రమంగా తప్పుకోవడం ఖాయం. ఇందులోభాగంగానే జూలైలో శ్రీలంక టూర్ కు దూరంగా ఉండాలనుకున్నారు. కానీ, కొత్త హెడ్ కోచ్ గంభీర్ కోరిక మేరకు ఆడారు. కానీ, జట్టుతో పాటు వీరూ విఫలమయ్యారు. దీంతో 27 ఏళ్ల తర్వాత లంక మన జట్టుపై వన్డే సిరీస్ నెగ్గింది. 2025లో వీరిద్దరూ లేదా ఎవరో ఒకరు వన్డేలకు వీడ్కోలు పలకడం ఖాయం. టెస్టుల్లోనూ కష్టమేనా? 2024లో కోహ్లి, రోహిత్ ఇద్దరికీ టెస్టులు పీడకలగా మారాయి. స్వదేశంలో ఇంగ్లండ్ తో ఐదు టెస్టుల సిరీస్ కు వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉన్న కోహ్లి.. మళ్లీ ఈ ఏడాది బంగ్లాదేశ్ తో రెండు టెస్టుల సిరీస్ లో ఆడాడు. న్యూజిలాండ్ తో మూడు టెస్టుల సిరీస్ లో పాల్గొన్నాడు. ఈ టెస్టుల్లో కోహ్లి ఒక్కటే అర్ధ సెంచరీ చేశాడు. ప్రస్తుత బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో సెంచరీ చేశాడు. రెండో టెస్టులో ఫెయిలయ్యాడు. గత 14 టెస్టు ఇన్నింగ్స్ లో కోహ్లి ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీనే చేశాడు. ఇక రోహిత్ ఇంగ్లండ్ తో, బంగ్లాతో, న్యూజిలాండ్ తో సిరీస్ లలో పాల్గొన్నాడు. ఆస్ట్రేలియాతో ప్రస్తుతం జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్ కు మాత్రమే అందుబాటులో లేడు. మొత్తం గత 12 ఇన్నింగ్స్ లో ఒక్కటే హాఫ్ సెంచరీ చేశాడు. అది కూడా బంగ్లాదేశ్ పై కావడం గమనార్హం. మళ్లీ చాంపియన్లుగా రిటైరవుతారా? 2024లో టి20 ప్రపంచ కప్ అందించి చాంపియన్లుగా రిటైరైన వీరు.. 2025లో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ అందిస్తారా? ప్రస్తుత ఫామ్ ప్రకారం చూస్తే మాత్రం కష్టమే అని చెప్పొచ్చు. సెకండాఫ్ డిజాస్టర్ పరుగులు సాధించే సత్తా కనమరుగు రోహిత్, కోహ్లి ఇద్దరూ పరుగులు సాధించడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కుర్రాళ్లు జైశ్వాల్, నితీశ్, గిల్ ఆట.. రోహిత్, కోహ్లిల ఆట చూస్తుంటే ఈ విషయం స్పష్టం అవుతోంది. దీనిని బట్టి చూస్తే.. 2025లో వీరిద్దరిలో ఒకరు టెస్టు క్రికెట్ కు వీడ్కోలు పలకడం ఖాయం. టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ కు టీమ్ ఇండియా అర్హత సాధిస్తే సరి.. లేదా ముందే వీరిలో ఒకరి టెస్టు కెరీర్ ముగిసినా ఆశ్చర్యం లేదు.

## డబ్ల్యూటీసీ అత్యధిక విజయాలు దానివే..
## కానీ ఫైనల్ చేరలేదు..చేరదు కూడా



వన్డేలు వచ్చాక టెస్టుల మనుగడ కష్టం అనుకున్నారు.. టి20లు వచ్చాక ఇంకా టెస్టులు ఎవరు చూస్తారు? అని ప్రశ్నించారు.. కానీ, సంప్రదాయ ఫార్మాటే క్రికెట్ ను నిలుపుతోంది.. ఓ దశలో బోర్ కొట్టించి ఉండొచ్చు గాక.. మరో దశలో అసలు ఫలితాలు వచ్చి ఉండకపోవచ్చు గాక.. కానీ, ఇప్పటికీ ఎప్పటికీ టెస్టులంటే టెస్టులే. ఆ ఫార్మాట్ లోని అసలు సిసలు క్రికెట్ మరేదాంట్లోనూ కనిపించదు. ఎడాపెడా కొట్టేసే టి20లు.. వన్డేల కంటే టెస్టుల్లోని సొగసైన షాట్లు.. పదునైన బౌలింగ్ మరెక్కడా చూడలేం. చాంపియన్ షిప్ ఐదేళ్ల కిందట మొదలైంది ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ). వన్డేల్లో, టి20ల్లో ప్రపంచ కప్ లు ఉన్నందున టెస్టుల్లోనూ ఆ లోటును తీర్చేందుకు దీనిని తీసుకొచ్చారు. అలాంటి చాంపియన్ షిప్ ఇప్పటికి రెండు సైకిళ్లు పూర్తిచేసుకుంది. మొదటిసారి 2019-21, 2021-23లో డబ్ల్యూటీసీ సైకిల్స్ ముగిశాయి. ప్రస్తుతం మూడోదైన 2023-25 సర్కిల్ నడుస్తోంది. దీని పాయింట్ల పట్టికలో మొన్నటివరకు టీమ్ ఇండియా టాప్ లో కొనసాగింది. కానీ, గులాబీ బంతితో ఆడిలైడ్ లో జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో ఓటమితో మూడో స్థానానికి పడిపోయింది. అత్యధిక విజయాలు దానివే.. టెస్టు క్రికెట్ పుట్టిల్లే కాదు.. టి20లకూ పుట్టిల్లు ఇంగ్లండే. ఇప్పుడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ కూడా అక్కడే లండన్ లో జరుగుతున్నాయి. కాగా, ఇప్పటివరకు చాంపియన్ షిప్ లో అత్యధిక విజయాలు సాధించిన జట్టు కూడా ఇంగ్లండే కావడం విశేషం. మొత్తం 64 టెస్టుల్లో 50 శాతం అంటే 32 గెలిచింది. టీమ్ ఇండియా రెండో స్థానంలో (53 మ్యాచ్ లలో 31 విజయాలు) ఉంది. ఆస్ట్రేలియా 48 మ్యాచ్ లలో 29 నెగ్గింది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా 18 చొప్పున, శ్రీలంక, పాకిస్థాన్ చెరో 12 మ్యాచ్ లను గెలిచాయి. వెస్టిండీస్ (9) అట్టడుగున ఉంది. ఫైనల్ చేరనేలేదు.. డబ్ల్యూటీసీ చాంపియన్ షిప్ లో అత్యధిక మ్యాచ్ లు గెలిచినప్పటికీ ఇప్పటివరకు ఇంగ్లండ్ ఫైనల్ కు చేరలేదు. 2019-21 సీజన్ లో భారత్, న్యూజిలాండ్, 2021-23 సీజన్ లో భారత్, ఆస్ట్రేలియా ఫైనల్ చేరాయి. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా విజేతలుగా నిలిచాయి. ప్రస్తుత సర్కిల్ లోనూ ఇంగ్లండ్ ఫైనల్ కు చేరే చాన్స్ లేదు. ఎందుకంటే.. ఆ జట్టు 45.24 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. వచ్చే మార్చి వరకు టాప్-2లో ఉన్న జట్టు ఫైనల్స్ కు అర్హత సాధిస్తాయి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com